Istegbal-E-Ramazan
(Telugu)

రమజాన్‌కు స్వాగతం

రచన
ఖుర్రమ్ మురాద్

అనువాదం
ఇఖ్బాల్ అహ్మద్

ముందుమాట

పవిత్ర రమజాన్ మాసం!

అల్లాహ్, ముస్లిం అనుచర సముదాయానికి అనుగ్రహించిన గొప్ప వరాలలో రమజాన్ మాసం అత్యంత గొప్ప వరం. మనకు ముహమ్మద్ ప్రవక్త (సల్లం) ద్వారా ప్రసాదించబడిన సన్మార్గం, గీటురాయి, కారుణ్యం, జ్యోతి, స్వస్థత అయిన దివ్యఖుర్‌ఆన్ ఈ మాసంలోనే లభించింది. బదర్ యుద్ధంలోని 'యౌముల్ ఫుర్ఖాన్' (ఖుర్‌ఆన్ దినం) ముస్లిం సముదాయానికి లభించింది. ఆ రోజు జరిగిన యుద్ధంలో మరణించవలసినవాళ్ళు స్పష్టమైన ప్రమాణంతో మరణించారు; బ్రతికుండవలసినవాళ్ళు స్పష్టమైన ప్రమాణంతో బ్రతికున్నారు. ఈ మాసంలో యౌముల్ ఫతహ్ (విజయదినం) కూడా సంభవించింది. ఆ రోజు ఒక్క బొట్టు కూడా రక్తం కారకుండా మక్కా నగరం తాళాలు ముస్లిం సముదాయానికి అప్పగించబడ్డాయి. రాజధాని అయిన ఆ నగరం (ఉమ్ముల్ ఖురా)లోనే కాబాగృహం ఉంది. దాని నిర్మాత, తౌహీద్ విప్లవ ధ్వజవాహకుడు, అత్యున్నత సుగుణ సంపత్తి కలవాడయిన హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) సుప్రసిద్ధ దైవప్రవక్త. ముస్లిం సముదాయ జీవితం, సమాజంలో గౌరవ స్థానం పొందే రహస్యం, ముహమ్మద్ సందేశం కోసం జిహాద్‌లో ఇమిడి ఉన్నాయి. మొదట మానవ హృదయాలు చూరగొనడానికి జిహాద్, తర్వాత సాంస్కృతిక ఆధిక్యత కోసం జిహాద్, ఆ జిహాద్‌తో పాటు విజయం కోసం ఆత్మవికాస పోరాటం, తద్వారా తఖ్వా పొందాలని, వ్యక్తిగత తఖ్వా (దైవభీతి) మరియు సామూహిక తఖ్వా కూడా. ఏకాంత సమయాల్లో దుఃఖించడం, అర్ధరాత్రి, వేకువజామున దైవాన్ని వేడుకోవడం, కన్నీరు కార్చడం, ప్రజాజీవితంలో (పబ్లిక్ లైఫ్‌లో) 'సత్యత', 'నిజాయితి', 'అమానతుదారీ', 'న్యాయశీలత', 'పరాక్రమం', 'సోదరభావం' మానవ హక్కుల పట్ల గౌరవం, వీటన్నింటినీ పొందే జ్ఞానం, ఆచరణల మార్గం రమజాన్.

దైవప్రవక్త (సల్లం) రమజాన్ మాసం రాకముందే అనుచరులను ఈ మాసపు ఖజానాల నుండి లబ్ది పొందడానికి సిద్ధం చేసేవారు. ప్రవక్త గారి ఈ

ఆదర్శాన్ని అనుసరించడంలో బహుశా నా పేరు కూడా మీ అనుచరుల రిజిష్టర్‌లో నమోదు చేసుకునే గౌరవం పొందడానికి నేను కొన్నేళ్ళ క్రితం "ఇస్తగ్‌బాలె రమజాన్" శీర్షికతో ఒక ప్రసంగాన్ని రికార్డు చేయించాను. ఆ ప్రసంగం క్యాసెట్ లభిస్తుంది. తర్వాత అది నా దగ్గర ఉన్నపుడల్లా ఆ ప్రసంగాన్ని ఒక చిన్న పుస్తకంగా మలిచాను.

ఈ చిరు పుస్తకంలో దివ్య ఖుర్‌ఆన్ నుండి మార్గాన్ని పొందడానికి, ఆ మార్గంలో నడవడానికి తప్పనిసరిగా కావలసిన తఖ్వా (దైవభీతి) రాత్రి నమాజులు, ఉపవాసాల ద్వారా లభిస్తుంది. రమజాన్ నుండి పూర్తిగా లబ్ధి పొందడానికి పది విధానాలు కూడా వివరించాను. ప్రతి విధానం క్రింద నా అభిప్రాయంలో ఒక సామాన్య మానవుడు కూడా సులభంగా ఆచరించదగ్గ సులభ ఉపాయాలను వివరించే ప్రయత్నం చేశాను.

ఈ పుస్తకం మొట్టమొదట మార్చి 1989లో అచ్చయ్యింది. తర్వాత 1992 వరకు ఏడు ఎడిషన్‌లు 82వేల కాపీలు అచ్చయ్యాయి. ఒక సంవత్సరం విరామం తర్వాత ఇప్పుడు మామూలు పునః పరిశీలన తర్వాత ఇది ఎనిమిదో సారి ముద్రించబడుతోంది. ఇహ్‌యా ఉలూముద్దీన్ గ్రంథం నుండి ఇమామ్ గజాలీ గారి ముక్తసరి ఉపదేశాల్ని కూడా అదనంగా చేర్చాను.

ఈ అల్ప ప్రయత్నాన్ని స్వీకరించమని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను. నాకు సంబంధించిన ఏ మాటయినా నాకు వ్యతిరేకంగా వివాదాస్పదం చేయకుండు గాక! నన్ను, చేయని దాని గురించి ఎందుకు చెబుతున్నావు?" అన్న పరిధిలో చేరకుండా కాపాడుగాక! నాకు పాఠకుల ప్రశంసలుకాక, దేవుని సమక్షంలో స్వీకారం కావటమే కావలసింది. ఇందుకు ఒక ఆధారం మీ ఆచరణ, మీ దుఆలే. కనుక మీరు ఈ పుస్తకాన్ని ప్రయోజనకారిగా గ్రహిస్తే, నా అంతం విశ్వాసంపై కలిగించమని, నన్ను తన మన్నింపుతో కప్పి వేయమని అల్లాహ్‌ను ప్రార్థించమని అభ్యర్థిస్తున్నాను.

15, షాబాన్ హిజ్రీ 1414 - ఖుర్రం మురాద్
28, జనవరి 1994.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

రమజాన్‌కు స్వాగతం

పవిత్ర రమజాన్-దివ్య ఖుర్ఆన్ మరియు తఖ్వా

కొన్నాళ్ళ క్రితంనాటి విషయం మరొకసారి పవిత్ర రమజాన్ మాసం మనపై అచ్ఛాదితం కానున్నది. దాని కారుణ్యాల జడివాన మన జీవితాల్ని సస్యశ్యామలం చెయ్యడానికి వర్షిస్తూ ఉండవచ్చు. ఈ మాసాన్ని దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం స్వయంగా గొప్ప మాసం, శుభప్రద మాసం అని అన్నారంటే ఈ మాసం ఘనతను ఏ విధంగా వర్ణించాలి? అంటే అంత గొప్ప ఘనత గల మాసం. అత్యంత శుభప్రదమైన మాసం. ఈ మాసపు ఔన్నత్యాన్ని ఊహించనూ లేము. మన జిహ్వ దాని సమస్త శుభాల్ని వర్ణించనూ జాలదు.

రమజాన్ మాసం ఎందువలన ఘనమైన మాసం?

ఈ మాసంలో అత్యంత ఘనమయిన రాత్రి ఒకటి ఉంది. ఈ ఒక్క రాత్రిలో వేల మాసాలను మించిన శుభాల ఖజానా పంచి పెట్టబడింది. ఇంకా పంచి పెట్టబడనుంది. ఆ శుభ రేయిలో మన ప్రభువు తన అత్యంత గొప్ప కారుణ్యాన్ని మనపై అవతరింప చేశాడు. **"ఇన్నా అన్‌జల్‌నాహు ఫీ లయ్‌లతిన్ ముబారకహ్"** మేము ఈ స్పష్టమయిన గ్రంథాన్ని శుభాలతో కూడిన రాత్రిలో అవతరింప చేశాము (అద్దుఖాన్ : 44:3) ఈ స్పష్టమయిన గ్రంథం అంటే ఏమిటి? రహ్మతమ్మిన్‌రబ్బిక్ మీ ప్రభువు తరఫు నుండి కారుణ్యమే కారుణ్యం.

కాని, నిజం చెప్పాలంటే ఈ మాసంలోని ప్రతి దినం 'పవిత్ర దినం'. ఈ మాసపు ప్రతి రాత్రి శుభరాత్రియే. పగలు ప్రకాశమంతం కాగానే అసంఖ్యాక దాసులకు వారు తమ ప్రభువు విధేయతలు, ఆయన అనుగ్రహం కోసం తమ

శరీరపరమయిన ధర్మబద్ధమయిన కోరికల్ని, తమ అవసరాల్ని సయితం విడనాడి, కేవలం అల్లాహ్ మాత్రమే తమ ప్రభువు అనీ, తమ లక్ష్యం, తమ ఆకాంక్ష అనీ, ఆయన విధేయత, దాస్యం కోరడమే జీవితపు అసలు ఆకలి దప్పులని, ఆయన సంతోషమే తమ హృదయాలకు మధురమైందని నరాలకు తేమ కలిగించే సాధనం అని సాక్ష్యమిచ్చే గౌరవం లభిస్తుంది. రాత్రి చీకటి వ్యాపించగానే అసంఖ్యాక దాసులు దైవసమక్షంలో నిలబడటం, ఆయనతో సంభాషించడం ఆయన స్తోత్రంతో మాధుర్యం, శుభాలలో మునిగిపోతారు. వారి హృదయాలు గాజు దీపాలవలె ప్రకాశమంతమై ఆకాశంలో రాత్రి తారలు తళతళ లాడినట్లు ఉజ్వలవంతమవుతాయి.

మసలు నూరిహీ కమిష్కాతిన్ ఫీహా మిస్‌బాహ్ అల్‌మిస్‌బాహు ఫీ జుజా జహ్ అజ్జుజాజతు కఅన్నహా కౌకబున్ దుర్రియ్యున్........... రిజాలున్ లాతుల్‌హీహిమ్ తిజారతున్ వలా బయ్‌ఉన్ అన్ జిక్రిల్లాహి వ ఇఖామిస్స లాతి వ ఈతాయిజ్జకాతి (నూర్ సూరా : 24:35-37)

ఆయన జ్యోతి ఉదాహరణ ఇలా ఉంది. ఒక గూటిలో దీపం ఉంచబడింది. ఆ దీపం ఒక గాజు చిమ్నీలో ఉంది. ఆ చిమ్నీ ముత్యంలాగా, మెరిసే నక్షత్రంలాగ.... (ఇటువంటి వారిని) వ్యాపారం, కొనుగోలు, అమ్మకాలు, లావాదేవీలు అల్లాహ్ స్మరణ, నమాజు స్థాపన, జకాతు చెల్లింపు నుండి ఏమార్చదు.

ఈ మాసంలోని ప్రతి ఘడియ గౌరవం, శుభాల ఖజానా ఇమిడి ఉన్నది. నఫిల్ సదాచరణలు, ఫర్జ్ సదాచరణల స్థాయి చేరుకుంటాయి. ఫర్జ్‌లు డెబ్భై రెట్లు బరువు, ఉన్నతం అవుతాయి. (సల్మాన్ ఫార్సీ తెలియ చేసినట్లుగా) రమజాన్ రాగానే ఆకాశద్వారాలు తెరచివేయబడతాయి. కారుణ్యాల వర్షం కురుస్తుంది. స్వర్గ ద్వారాలు తెరచివేయబడతాయి, సన్మార్గంలో నడిచే సద్బుద్ధి, సానుకూలత సర్వసామాన్యమయిపోతుంది. నరక ద్వారాలు మూసివేయ బడతాయి. ఉపవాసం పాపమార్గాలకు అవరోధం అయిపోతుంది. షైతానులను సంకెళ్ళలో బంధించడం జరుగుతుంది. చెడును వ్యాపింపచేసే మార్గాలు అతి తక్కువ అయిపోతాయి. (బుఖారీ, ముస్లిం; అబూహురైరా)

పవిత్ర రమజాన్ మాసంలో ఉపవాసదీక్ష పాటించినవారికి వారి ముందు వెనుకల పాపాలన్నీ మన్నించబడతాయనీ, రాత్రిళ్ళు నిలబడినవానికి పాపాలు కూడా క్షమించబడతాయి. ఇంకా షబెఖద్రలో నిలబడినవాని (నమాజ్‌లో) పాపాలు కూడా క్షమించబడతాయి. షరతు ఏమిటంటే అతడు తన ప్రభువు మాటలు, వాగ్దానాలు సత్యమని నమ్మాలి. తన దాస్య వాగ్దానాన్ని విశ్వసనీయత షరతుగా జోడించి నిభాయించాలి (పూర్తిచేయాలి). తాను ముందు జాగ్రత్త మరియు పాపపుణ్యాలు బేరీజు వేసుకోవడంలో ఏమరుపాటు వహించకూడదు. (బుఖారి, ముస్లిం; అబూహురైరా)

మీ వంతు

ఈ మాసం ఘనత, శుభాలు ఎంతో గొప్పవి అనడంలో సందేహం లేదు. అయితే ఈ మాసాన్ని పొందిన దీని కారుణ్యాలు, శుభాలు ప్రతి మనిషి వాటాలో వచ్చేశాయనుకోరాదు. వర్షం కురిసినపుడు అనేక నదులు, కాలువలు, చెరువులు తమతమ వైశాల్యం, లోతులను బట్టి ఆ వర్షపు నీటితో లబ్ధి పొందుతాయి. భూమిలోని వివిధ ప్రాంతాలు కూడా తమ స్తోమతను బట్టి పంట దిగుబడినిస్తాయి. వర్షం అన్నింటిపైనా సమానంగా కురుస్తుంది. కాని ఒక చిన్న గుంత, ఒక విశాలమయిన చెరువును నింపేటంత అధికంగా నీరు వస్తుంది. ఇదే విధంగా నీరు ఒక రాతి బండపై లేక బంజరు నేలపై పడితే ఆ నీరు దానిపై నుండి పారుతుంది. దానికి ఎటువంటి ప్రయోజనమూ కలుగదు. కాని భూమి సారవంతమయిందైతే అది పాడి పంటలతో వర్ధిల్లుతుంది. మనుషుల స్వభావం వారి భాగ్యం పరిస్థితి కూడా అంతే.

పవిత్ర రమజాన్‌లోని ఈ ఖజానాల నుండి మీకు దక్కేదేమిటి? భూమిలాగానే మీ హృదయాలు మెత్తబడితే, కళ్ళు చెమర్చితే, విశ్వాస బీజాన్ని మీలో నాటి, మీ యోగ్యత స్తోమతలను రక్షించుకుంటే, బీజం మొక్క అవుతుంది. మొక్క వృక్షంగా మారి సదాచరణల పళ్లూ, పూలూ ఆకులతో వర్ధిల్లుతుంది. రైతులాగా మీరు శ్రమపడి, కర్తవ్యం నెరవేరిస్తే స్వర్గలోకపు కానుకల పంట సిద్ధమవుతుంది. ఎంత బాగా కష్టపడితే అంతే మంచిపంట పండు

తుంది. హృదయాలు శిలల వలె కఠినమై, మీరు ఏమరుపాటు వహించిన రైతులా నిద్రలో మునిగిఉంటే రోజా, తరావీహ్, ఇంకా కారుణ్యం శుభాల నీరు యావత్తూ పార్లిపోతుంది. మీ చేతికి ఏమీ రాదు.

దైవానుగ్రహం లేకుండా ఏమీ లభించదు. అయితే ఈ దైవానుగ్రహం కూడా కృషి చేసినవాడికే లభిస్తుంది. అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి. మీరు ఆయన వైపు ఒక జానెడు జరిగితే ఆయన మీవైపు రెండు జానలు జరుగుతాడు. మీరు ఆయనవైపు నడిచి వస్తే ఆయన మీ వైపు పరుగెడుతూ వస్తాడు. (ముస్లిం-అబూహురైరా) కాని మీరు వీపు తిప్పి నిలబడిపోయి ఏమరుపాటు, అశ్రద్ధ వహిస్తే దైవానుగ్రహం ఎలా లభించగలదో చెప్పండి!?

కనుక, రమజాన్ మాసం పూర్తిగా గడిచిపోయి కారుణ్య శుభాలు బకెట్ల కొద్దీ కుమ్మరించబడుతూ ఉన్నా మీ జోలె ఖాళీగా ఉండిపోయేలా దురదృష్ట వంతులు అవకండి. ఎంతో కొంత సాధించడానికి, మీ వాటాలోని కారుణ్యా లను పొందటానికి నడుం కట్టండి. దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం గారి ఈ హెచ్చరికను బాగా గుర్తుంచుకోండి.

"ఉపవాసాల వల్ల ఆకలిదప్పులు తప్ప మరేమీ లభించనివారు ఎందరో ఉన్నారు. తమ నమాజులు రాత్రిళ్ళ మెలకువ తప్ప ఏమీ లభించని రాత్రిళ్ళు నమాజ్ చేసేవారు ఎందరు ఉన్నారో." (దారమి; అబూహురైరా)

అంతా మీపైనే ఆధారపడి ఉంది. దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం తన అనుచరులను సంబోధించి ఈ మాసపు ఘనత, శుభాలను కూడా ప్రవచించడంతోపాటు, దీని శుభాల ఖజానా నుండి తమ వాటాను తీసుకోవ డానికి పూర్తి శ్రమ, ప్రయత్నాల కోసం తాకీదు కూడా చేసేవారు. ఈనాడు ప్రవక్త (సల్లం) సున్నత్ కోసం ప్రయత్నించడంలో నా లక్ష్యం కూడా ఇదే. అంటే రమజాన్ మాసంలోని ఘనత శుభాల రహస్యం ఏమి చూపదలచుకున్నాను. దాని నుండి సంపూర్ణ ప్రయోజనం కోసం ఎటువంటి తయారీ, ఏర్పాట్లు అవసరమో చెప్పదలచుకున్నాను. ఏయే అంశాలను దృష్టిలో పెట్టుకోవాలో, శ్రద్ధను కేంద్రీకరించడం అవసరమో ఇంకా ఏ విధానాలు అవలంబిస్తే గమ్యం లభించగలదో, ఏ ధోరణి అవలంబిస్తే మార్గం లభించదో చూపదల్చుకున్నాను.

శుభం, ఘనతల రహస్యం

రమజాన్ మాసంలో ఉన్న ఘనత, శుభాల రహస్యం ఎందులో ఇమిడి ఉందో తెలుసుకోవడం ముందుగా అవసరం. ఇది తెలుసుకోకుండా దాని ఖజానాలతో మన ఒడి నింపుకోవడం సాధ్యం కాదు. అందుకు ఏకాగ్రత, దీక్ష, కృషి పూనడం సాధ్యపడదు. ఇవి ఈ లక్ష్యసాధనకు తప్పనిసరి. ఈ ఘనత, శుభాల రహస్యం అంతా కూడా ఒక్క విషయంలో ఇమిడి ఉంది. అది ఈ మాసంలో దివ్య ఖుర్‌ఆన్ అవతరణ జరిగింది. అంటే అవతరణ ఆరంభ మయింది. పూర్తి ఖుర్‌ఆన్ ఆకాశంలోని సురక్షిత స్థానం నుండి తీసి జిబ్రయీల్ (అలైహి)కు అప్పగించబడింది లేక అవతరణకు నిర్ణయం జరిగింది.

అంటే ఈ మాసంలో కరుణామయుడు, కృపాశీలుడు అయిన ప్రభువు (అల్లాహ్) మనలాంటి మానవుల మార్గదర్శనం కోసం ఏర్పాట్లు చేశాడు. అంతులేని ఆయన ప్రావీణ్యం మన ఆలోచన, ఆచరణలకు వాస్తవ మార్గాల్ని ప్రస్ఫుటం చేసింది. సత్యమేదో అసత్యమేదో పరీక్షించడానికి, దోష వంకలు, మార్పులు లేని పవిత్ర గీటురాయిని ప్రసాదించాడు. రమజాన్‌లోని ఒక ఉదయాన ప్రాతః కాలంలో దైవవాణి యొక్క ప్రథమ కిరణం ముహమ్మద్(స) హృదయాన్ని ప్రకాశవంతం చేసినప్పుడు ఇది సంభవించింది. అంటే ఈ మాసంలో ఉపవాసాలు పాటించబడే కారణంగా ఖుర్‌ఆన్ పారాయణానికి ఏర్పాట్లు జరిగే కారణంగా రమజాన్ మాసం శుభప్రదం అయిందా? లేదు. అసలు విషయం ఇలా ఉంది. ఉపవాసాలు ఖుర్‌ఆన్ పారాయణం కోసం ఈ మాసాన్ని ఎంచుకోవడానికి కారణం ఖుర్‌ఆన్ అవతరణ అనే బ్రహ్మాండ మయిన, ఏకైక, నిరుపమాన సంఘటన కారణంగా ఈ మాసం, ఆదిలోనే ఘనత, అత్యంత వైభవోపేతం అయింది. ఈ బ్రహ్మాండమయిన సంఘటన కోరేది, దీని పగళ్ళను ఉపవాసాల కోసం, రాత్రులను నమాజ్,పారాయణం కోసం ప్రత్యేకించు కోవడమే. అల్లాహ్ ఈ విషయాన్ని ఇలా వెల్లడిస్తున్నాడు:

"షహ్రు రమజానల్లజీ ఉన్‌జిల ఫీహిల్ ఖుర్‌ఆన్. హుదల్లిన్నాసి వ బయ్యినాతిమ్ మినల్ హుదా వల్ ఫుర్‌ఖాన్, ఫమన్ షహిద మిన్‌కు ముష్షహ్‌ర ఫల్‌యసుమ్‌హు" (బఖర 2:185)

"రమజాన్ ఖుర్ఆన్ అవతరింపచేయబడిన మాసం. ఖుర్ఆన్ సకల మానవాళి కోసం సంపూర్ణ సన్మార్గం. అందులో సన్మార్గం చూపే, ధర్మాధర్మాల తేడాను విడమర్చి చూపే స్పష్టమైన బోధనలు ఉన్నాయి. ఈ మాసాన్ని పొందిన వాడు తప్పనిసరిగా ఈ మాసంలో ఉపవాసాలు ఉండాలి."

ఖుర్ఆన్ అనుగ్రహం

దివ్య ఖుర్ఆన్ అల్లాహ్ అనుగ్రహాలలోకెల్లా అత్యంత గొప్ప, నిరుపమాన అనుగ్రహం. దాని కారుణ్యాలలో అతిపెద్ద అనుగ్రహం, దాని అవతరణ మానవ చరిత్రలోనే అపూర్వ సంఘటన. ఉరకలు వేసిన దైవ కారుణ్య కడలి ప్రపంచంలో అపూర్వ ప్రదర్శన. అందుచేతనే ఆయన ఇలా సెలవిచ్చాడు:

"అర్రహ్మాను అల్లమల్ ఖుర్ఆన్." అమితంగా కరుణించే అపార శీలు డయినవాడు, ఖుర్ఆన్ బోధనలనిచ్చినవాడు. ఇంకా తన్‌జీలుమ్మిన ర్రహ్మా నిర్రహీమ్ అమిత దయామయుడు అపార కృపాశీలి అయిన వానిచే అవత రింపచేయబడింది. మనిషికి సంపూర్ణ న్యాయం కోసం ఏదైనా త్రాసు ఉన్నదీ అంటే ఈ ఖుర్ఆన్‌యే. జ్యోతి అంటే ఇదే. స్వస్థత నిచ్చే చిట్కా ఇదే.

మనపైనయితే అల్లాహ్ అనుగ్రహాలు లెక్కలేనన్ని ఉన్నాయి. మనం ప్రతిక్షణం రెండు చేతులతో ఆ అనుగ్రహాల ఖజానా అందుకుంటున్నాం. కాని ప్రపంచం, ప్రపంచంలోని ప్రతి అనుగ్రహం మన ఉఛ్వాస నిశ్వాసాలు సాగినంత వరకే మనవి. ఇక చివరి శ్వాస వెలువడిందో మన జీవితంలోని క్షణాలన్నీ అంతం, ప్రపంచంలోని వరాలేవీ మనకోసం మిగిలి ఉండవు. జీవితంలోని ఈ నశింపు పొందే క్షణాలని నశింపులేని జీవితంలో శాశ్వతంగా మిగిలుండే క్షణాలుగా అనుగ్రహాలుగా మార్చే వస్తువు ఏదయినా ఉందీ అంటే అది దివ్య ఖుర్ఆన్ అనుగ్రహం మాత్రమే. అందువల్లనే ఇది ప్రపంచ ఖజానాలలోకెల్లా విలువైన ఖజానా. అందుకే ఇది అవతరించబడిన రాత్రిని 'లైలుమ్ముబారక్', 'లైలతుల్ ఖద్ర్' అని అన్నాడు. ఇంకా అది అవతరింపచేయబడిన ప్రస్తావన వచ్చిన చోటల్లా తరచుగా దాని సంబంధాన్ని తన కారుణ్యం, పలుమార్లు చూపబడే కారుణ్యం, తన అంతులేని యుక్తి,

తన అమోఘమైన శక్తితో జోడించాడు. అందువల్లనే రమజాన్ చివర పండుగ ఉత్సవం చేయవలసిందిగా చెప్పాడు. ఈ మాసం ఖుర్‌ఆన్ అవతరణకు పుట్టినరోజు.

'యా అయ్యుహన్నాసు ఖద్‌జాఅత్‌కుమ్ మౌఇజతున్ మిర్‌బ్బికుమ్ వ షిఫా ఉల్లిమా ఫిస్సుదూరి వహుదవ్‌(వ రహ్మతుల్‌ల్లిల్ ము'మినీన్, ఖుల్ బిఫజ్‌లిల్లాహి వ బిరహ్మతిహీ ఫబిజాలిక ఫల్‌యఫ్‌రహూ హువ ఖైరున్‌మ్మిమ్మా యజ్‌మవూన్'. (యూనుస్ : 57,58)

ప్రజలారా! మీ వద్దకు మీ ప్రభువు తరపు నుండి హితబోధ వచ్చేసింది. ఇది మనో రుగ్మతలకు నివారిణి. దీనిని అంగీకరించిన వారికోసం మార్గదర్శిని, కారుణ్య ప్రదాయిని. ఓ ప్రవక్తా! ఇది అల్లాహ్ కటాక్షం అని దీనిని ఆయన పంపాడు. అంటే ఆయన మెహర్బానీ అనీ చెప్పు. అందుచేతనే ప్రజలు సంబరం చేసుకోవాలి. ప్రజలు సమీకరిస్తున్న వస్తువులన్నింటికన్నా ఇది ఉత్తమమైనది.

అన్ని దినాలూ, అన్ని మాసాలు ఒకేలా ఉంటాయి. ఇవన్నీ దైవ సృష్టితాలు. వాటి మధ్య తేడా ఏమీ ఉండదు. కాని కొన్ని క్షణాలు, వాటితోపాటు సకల మానవాళి, సకల సృష్టి యొక్క అదృష్టం అంటిపెట్టుకుని ఉంటుంది. అటువంటి క్షణమే హిరా కొండ గుహలో దైవబోధ యొక్క ఆఖరి కిరణం ప్రవేశించింది. దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దానికి సంరక్షకుడు, వాహకుడు అయ్యాడు. పవిత్ర రమజాన్ మాసం ఈ మహోన్నత క్షణాన్ని మోసుకొచ్చింది. ఇదే పవిత్ర రమజాన్ ఘనత, శుభాల రహస్యం.

రమజాన్‌లో రోజా, తరావీహ్ ఎందుకు?

ఖుర్‌ఆన్ అవతరణ ప్రారంభమైన ఈ మాసంలో ప్రతి రోజూ ఉపవాసం పాటించడానికి, ప్రతి రాత్రీ కొన్ని ఘడియలు నిలబడి ఖుర్‌ఆన్ వినడానికి ఎందుకు ప్రత్యేకించబడింది? ఖుర్‌ఆన్ వరం వాస్తవికత ఏమిటో మీరు తెలుసుకుంటే, ఖుర్‌ఆన్‌కు వాహకుడి బాధ్యత ఏమిటో కాస్త ఆలోచిస్తే, ఈ విషయం అర్థం చేసుకోవడం ఏమంత కష్టం కాదు.

ఖుర్‌ఆన్ గొప్ప అప్పగింత మరియు మిషన్

వరం ఎంత అమూల్యమయినదయితే దాని హక్కు నెరవేర్చవలసిన బాధ్యత అంతే భారమైనది అవుతుంది. దైవగ్రంథం గొప్ప వరం, కారుణ్యం, శుభం. అందుచేత ఇది తనలో బాధ్యతలతో కూడిన ఒక పూర్తి ప్రపంచాన్ని కలిగి ఉంటుంది. జీవిత అసలు లక్ష్యం, జీవితాన్ని విజయవంతం, సఫలవంతం చేయడానికి నిజమయిన మార్గం వైపు మార్గదర్శకత్వం నెరపుతుంది అన్న విషయం ఆధారంగా ఈ బాధ్యతలు ఉన్నాయి. ఈ గ్రంథం మానవుని సకల ప్రత్యక్ష, పరోక్ష, వ్యక్తిగత, సాముహిక రోగాలకు స్వస్థతనిచ్చే ఫార్ములా. కారుచీకట్లలో కొట్టుమిట్టాడేవారికి దారి చూపే దీపం ఈ గ్రంథం.

దైవోపదేశపు ఈ కానుక, రెండు గురుతర బాధ్యతల్ని తన వెంట తెస్తుంది. ఒకటి అది చూపిన మార్గంపై స్వయంగా నడవడం, దాని వెలుగులో మన జీవన యాత్ర కొనసాగించడం, మన రోగాల చికిత్సలో స్వస్థత కోసం దాని ఫార్ములాని మన హృదయాన్ని, మన ఆలోచనని, మన చింతన, ఆచరణల్ని, గుణగణాలు, నడవడిని అది చూపిన అచ్చులో మూసపోయడానికి ప్రయత్నం కొనసాగించడం.

రెండోది ఏది మానవులకు ఉపదేశమో అది సర్వ మానవుల కోసమూ ఉంది. మన కోసం మాత్రమే కాదు. ఈ ఉపదేశాన్ని ప్రజలందరూ చేరవేయడం, వారిని ఈ మార్గంపై నడవమని ఆహ్వానించడం, చీకట్లలో దారులపై దీపాలు వెలిగించడం, రోగులకు మందులు పంపిణీ చేయడం.

ఆలోచిస్తే, రెండవ బాధ్యత మొదటి బాధ్యతనే తప్పనిసరిగా కోరుతుంది. దాని తప్పనిసరి భాగం. రెండవ పని చేయనిదే మొదటి పని సంపూర్ణం కాజాలదు. ఒకవైపు దివ్య ఖుర్‌ఆన్ మానవులందరికీ ఉపదేశం అన్న జ్ఞానం, విశ్వాసం ఉండటం, దీనిని ఇతరుల వరకూ చేర్చడాన్ని కోరుతుంది. తాను ఎరిగిన మార్గాన్ని చూపడం అనేది దారి తప్పినవారి హక్కు. మరోవైపు, ఇతరులకు ఖుర్‌ఆన్ మార్గంపై నడిపించే ప్రయత్నం చేయకపోతే మీరు మీ నిజమార్గంపై, ఖుర్‌ఆన్ చూపిన మార్గంపై నడవడం కూడా నాణ్యత లేనిది,

అసంపూర్ణమైనది. ఈవిధంగా మన గమ్యం కూడా చెల్లనిదవుతుంది. ఎందుకంటే సందేశం, ఎడతెగని కృషి, ఖుర్‌ఆన్ ప్రకారం ఆచరణ, ఖుర్‌ఆన్ పట్ల వ్యవహారణ యొక్క తప్పనిసరి భాగం. ఇంకా చెప్పాలంటే అత్యున్నత ఆచరణ. ఎందుకంటే మీ జీవితం ఇతర మానవుల జీవితాలతో సంబంధ బాంధవ్యాలతో ఎలా ముడిపడి ఉందంటే, వారు కూడా ఆ మార్గంపై నడవనంతవరకూ మీరు ఒంటరిగా నడవడం కష్టం. ఇంకా పూర్తిగా నడవడం మరింత కష్టం.

చూడండి, దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం పై అవతరించబడిన మొదటి వహీ ఇఖ్రా 'చదువు' అన్న ఉపదేశాన్ని తెచ్చింది. "చదువు" చదవడంలో వినిపించే పని కూడా చేరిఉంది. రెండవ వహీ ఈ విషయాన్ని పూర్తిగా విడమర్చింది. ముక్తసరి విరామం తర్వాత చెప్పబడింది. 'ఖుమ్ ఫన్‌జిర్' 'లేచి నిలబడు, హెచ్చరించు' 'రబ్బక ఫకబ్బిర్' అంటే సకల మానవుల ఎదుట అల్లాహ్ ఔన్నత్యాన్ని ప్రకటించు. వారిపై ఆయన ఔన్నత్యాన్ని నిలబెట్టు; ఆయనే పెద్దవాడు కావాలి. మిగతా పెద్దరికాలన్నీ ఆయన ఎదుట తలదించుకోవాలి. చివరకు భూమిపై ఎవరూ దేవుడయి రాజ్యమేలకూడదు. ఎవరూ తననుగానీ, తన ఇష్టాన్నిగానీ తనవంటి మానవుల నెత్తిన రుద్దకూడదు. మానవుల తలలు తమ సృష్టికర్త, యజమాని ఎదుట మాత్రమే వంగాలి.

ఆలోచించండి, ఉమ్మతె ముస్లిమా రూపకల్పన కేవలం ఈ లక్ష్యం కోసమే జరిగింది. లేకుంటే దివ్య ఖుర్‌ఆన్ అవతరణ ప్రారంభమయినప్పుడు తౌహీద్ (ఏకత్వాన్ని) అంగీకరించే దాసులు అక్కడ ఉన్నారు. ప్రవక్త పదవిపై, దైవగ్రంథంపై విశ్వాసం కలిగి ఉండేవారు. వారు ఆరాధనాలయాల్లో నిలబడి రాత్రంతా దైవదాస్యం చేసేవారు. ఉపవాసాలు పాటించేవారూ ఉన్నారు. వారికి దైవంతో కల సంబంధాన్ని, వారి సద్గుణాల్ని అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ప్రశంసించాడు. మరొక కొత్త ప్రవక్త పదవి, ఒక నూతన సందేశం, ఒక నూతన సమాజం ఎందుకు అవసరం అయ్యాయి? ఒకవైపు విశ్వాసం, ఆచరణల మార్గాలు మానవుల అజ్ఞానాలన్నింటి నుండి పవిత్రవంతమయి ఉజ్వలం అయిపోవాలి.

అయితే మరోవైపు, మానవుల ఎదుట తమ ప్రభువు, ఆయన ధర్మం గురించి సాక్షిగా నిలబడే ఒక సమాజం (ఉమ్మత్) ఉనికిలోకి రావడం కోసం తద్వారా మానవులు న్యాయంపై నిలబడాలని **వ కజాలిక జఅల్నాకుమ్ ఉమ్మతన్‌వ్వ సతల్ లితకూను షుహదాఅ అలన్నాసీ.** **(బఖరా, 2:143)**

ఇది ఖుర్‌ఆన్ మిషన్. ఖుర్‌ఆన్‌ను పొందే, ఖుర్‌ఆన్ యొక్క బాధ్యతను మోసే వాహకులు అయిన ఫలితంగా నా యొక్క, మీ యొక్క, ఖుర్‌ఆన్‌పై విశ్వాసం ప్రకటించే యావత్ సమాజం యొక్క మిషన్‌గా అంగీకరింపబడిన మిషన్ ఇదే.

ఈ బాధ్యత ఎంత గురుతరమైన బాధ్యతో ఊహించడం కష్టం.

మానవాళినంతటినీ సన్మార్గగామి చేయడం, ఇదొక అత్యంత గొప్ప ఘనకార్యం. అందుచేతనే దైవప్రవక్త (సల్లం) హిరా గుహ నుండి మొదటి సందేశంతో ఇంటికి వచ్చినప్పుడు వణుకుతూ వచ్చారు. అల్లాహ్‌యే స్వయంగా ఈ వాణి బాధ్యత తీసుకోవడం భారీమాట దృఢవాక్కు అన్నాడు. నడ్డి విరిచే భారం అన్నాడు ఇదేదో సులభ కార్యం కాదు. అలాగని దాని బాధ్యత వహించడం మానవునికి అసాధ్యం అయిన పనీకాదు. లేకుంటే, కరుణామయుడు, న్యాయశీలుడు, వివేచనాపరుడయిన అల్లాహ్ ఇటువంటి బరువు ఎందుకు మోపుతాడు?

ఇక ఈ భారాన్ని మోయడానికి మనలో కేవలం అల్లాహ్‌కు మాత్రమే దాసుడు అయినవాడు, తన దాస్యంలో ఎవరికీ చోటివ్వనివాడు అయిన మనిషి మనలో తయారుచేయడం అవసరం. కొత్త మనిషిగా మారడానికి, అల్లాహ్ ఆదేశం మాత్రమే చెలామణి అయ్యే, మెడలు అల్లాహ్ ఎదుట మాత్రమే వంగే ప్రపంచం తయారు చేయడానికి 'ఖుర్‌ఆన్‌పై విశ్వాసమూ అవసరం', 'ఖుర్‌ఆన్ జ్ఞానమూ' అవసరం. ఖుర్‌ఆన్‌తో ప్రగాఢ సంబంధమూ అవసరం. సహనం, నిలకడ కూడా అవసరం. ఇంకా ఎడతెగని కృషి, త్యాగం కూడా తప్పనిసరి. ఖుర్‌ఆన్ మిషన్ ఉన్నత గుణాల్ని కోరుతుంది. మనిషి ఖుర్‌ఆన్ పతకాన్ని చేత బూనితే చింతన, ప్రవర్తనలను కూడా ఉన్నతం చేయగోరుతోంది. అందుకోసం ప్రత్యేక శక్తిస్తోమతలు అవసరం.

ఖుర్‌ఆన్, తఖ్వా, రోజాతో సంబంధం

ఈ శక్తి, స్తోమతలకు ఆ ఉత్తమ యోగ్యతలకు మూలస్థానం తఖ్వా. అల్లాహ్ తన గ్రంథం (ఖుర్‌ఆన్) ఆరంభంలోనే స్పష్టం చేశాడు. ఈ గ్రంథం ద్వారా సన్మార్గాన్ని చూడగలిగేవారు, సన్మార్గంపై నడవగలిగేవారు, ఆ మార్గంపై నడవ గలిగినవారు తఖ్వా (దైవభీతి) కలవారు మాత్రమే అని, 'హుదల్లిల్ ముత్తఖీన్' మరోవైపు ఉపవాసం పాటించే లక్ష్యం, మరోలా చెప్పాలంటే ఉపవాసాల వలన ప్రయోజనం 'ల అల్లకుమ్ తత్తఖూన్'గా చెప్పబడింది. తద్వారా మీలో దైవభీతి జనించాలని.

ఈ రెండు ఆయత్‌లనూ కలిపి చదవండి. ఉపవాసాలతో దివ్య ఖుర్‌ఆన్‌కు ఇంత ప్రగాఢ సంబంధానికి కారణం ఏమిటో, దివ్య ఖుర్‌ఆన్ అవతరణ జన్మదినమయిన మాసాన్ని ఉపవాసాల కోసం ఎందుకు ప్రత్యేకం చేయబడిందోనన్న రహస్యం మీకు ఎరుక అవుతుంది. ఉపవాసం ద్వారా తఖ్వా గుణం జనింపచేసే ప్రయత్నం చేయడానికి ఖుర్‌ఆన్ మార్గం సులభతరం కావడానికి ఖుర్‌ఆన్ అప్పగింత భారం మోయడం సాధ్యపడే ఈ మాసపు శుభ ఘడియల కన్నా ఎక్కువ సముచిత సమయం ఇందుకోసం మరేది కాగలదు.

తఖ్వా అంటే ఏమిటి?

తఖ్వా (దైవభీతి) మహోన్నతమయిన అపూర్వ గుణం. కావలసిన గుణాల సమగ్ర రూపం కూడా. తఖ్వా గుణం కలవారికి అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఇహపరాల మేళ్ళు అన్నింట గ్యారంటి యిచ్చాడు. దానితో ప్రతి ఇక్కట్టు నుండి బయటపడే మార్గం లభింపచేసేది తఖ్వా. తఖ్వా వలన ఉపాధి ద్వారాలు ఊహించలేని విధంగా తెరుచుకుంటాయి. తఖ్వా కారణంగా ధార్మిక, ప్రాపంచిక పనులన్నీ సులభం అయిపోతాయి. అల్లాహ్ పాపాలను పూడ్చి పారేస్తాడు. గొప్ప ప్రతిఫలం అనుగ్రహిస్తాడు. భూమీ ఆకాశాలంతా విశాలమైన స్వర్గ శుభవార్త ఇవ్వబడినవారే ముత్తఖీలు. ఆ స్వర్గం వైపు తీసుకుపోయే మన్నింపు వారికే వాగ్దానం చెయ్యబడింది. స్వర్గం అయితే వారి వారసత్వంలో

ఉన్నదే. విశ్వాసమూ, దైవభీతి కలవారికి ప్రపంచంలో కూడా భూమీఆకాశాల నుండి శుభాల ఖజానా తెరవబడుతుందని వారికి వాగ్దానం చెయ్యబడింది.

"వలౌ అన్న అహ్‌లల్ ఖురా ఆమనూ వత్తఖూ ల ఫతహ్‌నా అలైహిమ్ బరకాతిమ్మినస్సమాయి వల్‌అర్జ్" (అల్ ఆరాఫ్ 7:97)

"బస్తీల ప్రజలు విశ్వసించి, తఖ్వా గుణాన్ని అవలంబిస్తే మేము వారిపై భూమీ ఆకాశాల నుండి శుభాల ద్వారాలను తెరచి వేస్తాము."

తఖ్వా అంటే ఏమిటి? విషయాన్ని ప్రోగుచేసి చెప్పాలంటే ఇలా చెప్పాలి. హృదయం, ఆత్మ, స్ఫూర్తి, ముందుచూపు, దీక్ష, దృఢ నిర్ణయం, నియంత్రణ, క్రమశిక్షణ, ఆచరణ, గుణగణాలు, శక్తి మరియు స్తోమతల పేరు. దాని మూలంగా తప్పులని తెలిసిన మనం అంగీకరించిన దాని నుండి మనం ఆగిపోతాం, దాని వలన మనకు నష్టం కలుగుతుందని భావిస్తాం. ఇంకా మనకు తెలిసిన, మనం అంగీకరించిన విషయంపై స్థిరంగా ఉంటాం. తఖ్వాకు నిఘంటువు అర్థం కాపాడుకోవడం. ఈ అర్థాలలో తఖ్వాకు మిక్కిలి ప్రాథమికమైన, ప్రారంభ దశలోని భావాన్ని మీ ముందు ఉంచాను.

ఈ శక్తి మన స్వభావంలో రెండు రకాలుగా ఉంది. మనం నష్టం, బాధల నుండి తప్పించుకోవాలి. లాభానికి ఆశ కూడా కలిగి ఉండాలి. దాన్ని పొందే ప్రయత్నమూ చేయాలి. మనలో దాన్ని పొందాలన్న కోరిక, శక్తి లేకపోయి నట్లయితే మానవ జీవిత వికాసం అసంభవం. అతడు అభివృద్ధి సాధించలేడు. మనం కాలుతున్న మంటలో చెయ్యిపెట్టం. పైగా మన చెయ్యి దానంతట అదే మంట నుండి వెనక్కి వచ్చేస్తుంది. మన పిల్లవాడు పొరపాటుగా మంట దగ్గరగా వెళితే మనం కంగారుపడి ఎలాగయినా పిల్లవాడ్ని కాపాడు కోవాలని పరుగెడతాం. ఎందుచేత? నిప్పులో మన చెయ్యి కాలుతుందని, అగ్ని పిల్ల వాడ్ని కాలుస్తుందని, అతడి ప్రాణం పోవచ్చని మనకు నమ్మకం ఉండబట్టే. ఇది ప్రపంచంలోని అగ్ని నుండి తఖ్వా పొందటం. ఈ అగ్ని వలన కలిగే నష్టం మన అనుభవంలోనిదే. ఇది మన కళ్ళెదుట ఉంది. అందుచేత దాన్నుండి కాపాడుకొనే స్తోమత బలీయమైంది.

మరొక అగ్ని ఉంది. ఈ అగ్ని విశ్వాసం, కర్మలు, చింతన, నైతికతల చెడుగులతో భగ్గుమంటుంది. ఏ మార్గాల్లో నడిస్తే ఈ ప్రపంచం, రాబోయే ప్రపంచంలో ఈ దైవాగ్నిలో పడటం, మాడిపోవడం సాధ్యమో అన్న విషయాన్ని దివ్య ఖుర్‌ఆన్ తెలుపుతుంది. ఈ మార్గాల దరిదాపులకు పోవద్దని ఈ అగ్ని నుండి కాపాడుకోండని అది హెచ్చరిస్తుంది. సత్య తిరస్కారం, అవిధేయత, జులుం, అబద్ధం, హరాం సొమ్ము, ఇతరుల హక్కును కాజేయటం, వారిని హింసించటం - ఇవన్నీ అగ్నియే.

ఈ అగ్నిని మనకళ్ళు చూడలేవు. మనకు వాటి అనుభవం లేదు. ఆ అగ్నిలో చెయ్యిపెట్టి మండే బాధను వెంటనే చవిచూడలేం. ఈ లోకంలోని అగ్నిని మనం చూస్తాము. ఆ మంట బాధను వెంటనే మనం చవి చూస్తాము. దాని వలన కలిగే నష్టం ఏమిటో మనకు బాగా తెలుసు. కనుకనే తప్పనిసరిగా దాన్నుండి కాపాడుకుంటాము. ఇటువంటి దృఢనమ్మకమే అబద్ధం పలికినందువల్ల నాలుక అగ్నిలో కాలుతూ ఉందని, హరాం తినడం వలన కడుపు అగ్నితో నింపబడుతోందని, హరాం మార్గంపై నడిచినందుకే అగ్ని పడకగానూ, కప్పుకునే దుప్పటిగానూ, ఆహార పానీయాలుగా అవుతుందన్న విషయంలో మనకు స్పృహ ఉన్నట్లయితే కచ్చితంగా మన మనసులు, శరీరం, ప్రాణాలు మనల్ని ఈ పనుల నుండి కాపాడటంలో విజయవంతం చేసే శక్తి స్తోమతలు జనిస్తాయి.

ఇది అల్లాహ్ పట్ల, ఆయన అగ్నిపట్ల తఖ్వా పాటింపు. ఈ తఖ్వాకు ప్రథమ మూలం అగోచరాలపై విశ్వాసం. అగోచరాలపై విశ్వాసం కలవారే ఖుర్‌ఆన్ నుండి సన్మార్గం పొందే ముత్తఖీలు **'అల్లజీన యూమినూన బిల్‌గైబ్'** ఈనాటి విశ్వాసంలోని దోషం, దుర్భడతలే రేపటి అగ్ని. ఈనాడు మనం దాన్ని చూడలేం. ఈ విషయం పట్ల నమ్మకం వల్లనే తఖ్వా జనిస్తుంది. ఈ విశ్వాసం, నమ్మకం వల్లనే, ఖుర్‌ఆన్ మార్గంపై నడవడానికి అన్నింటికన్నా ముఖ్యంగా కావలసిన శక్తి జనిస్తుంది.

తఖ్వా యొక్క ఈ వాస్తవికతను ముందుంచుకుని పరిశీలించండి. మనం అంగీకారం, నైతికత మరియు కర్మలలో తప్పూ-ఒప్పూ, ధర్మ-అధర్మాలు ఒక శాశ్వత ప్రమాణాన్ని స్వీకరించి దాన్ని పాటించడం అన్నింటి

కన్నా ముఖ్య విషయమని మీరు వెంటనే గ్రహిస్తారు. విశ్వాసాలు నైతికతలో తప్పు-ఒప్పుల శాశ్వత ఉనికి, విధానం, ప్రమాణం ఏదీ లేదనే వారు ఇది కాలం, పరిస్థితులను బట్టి మారే అదనపు విషయం. నిన్నటి ఒప్పు నేటి తప్పు కావచ్చు. నేడు తప్పు అయినది రేపు ఒప్పు కావచ్చు. మనిషి విశ్వాసం కలవాడ యినా, విశ్వాసం లేనివాడయినా ఎటువంటి తేడా జరగదు అనే వారి కోసం తఖ్వా ప్రశ్నే తలెత్తదు.

మనం, అల్లాహ్‌ను మన ప్రభువుగా అంగీకరించాం. అంటే ఆయన ఆజ్ఞాపించినదే ధర్మమని, సత్యమని, దాని వలన ఆయన సమ్మతి లభిస్తుం దని దానికి సంబంధించిన జ్ఞానం ఆయనే ఇచ్చాడని, ఆయనకు అయిష్టం కలిగించే ప్రతి విషయమని, దానివల్ల ఆయన ఆగ్రహం పెల్లుబుకుతుందని, దాని వలన ఆయన పట్ల అవిధేయత అవుతుందనీ అది తప్పు, అధర్మం, నష్ట దాయకం అని, దాని నుండి రక్షణ పొందటం అవసరం అన్నదే దాని అర్థం.

అల్లాహ్‌ను ప్రభువుగా అంగీకరించడం అంటే అర్థం మరొకటి కూడా ఉంది. కొన్ని వాస్తవాలున్నాయి. వాటిని మనం చూడలేం, రుచిచూడలేం. మన ఇంద్రియాలకు అతీతం. వాటికి శరీరం, ప్రాణం లేవు. ఆకలి దప్పులు లేవు అవి కోరికలు వెంటనే తీరడంకన్నా మధురమయినవి, విలువయినవి.

దానికి మరో అర్థం కూడా ఉంది. తప్పొ-ఒప్పుల జ్ఞానం ఇవ్వగలిగింది ఆయనే. ఆ వాస్తవాల పరిజ్ఞానం కూడా ఆయన నుండే లభించగలదు. ఆయనకు గోచర, అగోచరాలు రెండింటి జ్ఞానమూ ఉంది. ఆయన ఇష్టమే తప్పొప్పులకు గీటురాయి.

ఈ అగోచర విషయాలను విశ్వసించేవారే, ఈ విషయాలను అంగీ కరించేవారే ముత్తఖీలు కాగలరు. అందుకోసం ఒకే మార్గం ఉంది. వారు తమ ధన, మాన, ప్రాణాలను తమ ప్రభువుకు అప్పగించాలి. వారు లేవడం, కూర్చోవడం, నడవడం, తిరగడం, ఆలోచించడం, మాట్లాడడం అంతా కూడా అల్లాహ్ ఆదేశం ప్రకారమే జరగాలి. ఆయన దాస్యం కోసం అంకితం అయి పోవాలి. ఆయన ఇచ్చినదంతా-సంపద అయినా, సమయం అయినా భౌతిక వరం అయినా, అర్థ సంబంధమయినదైనా-ఆయన మార్గంలోనే వెచ్చించాలి. ఆయన కోసమే ఖర్చు చేయాలి. రేపు ఆయన్ని కలవాల్సి ఉందని, అప్పటి సాఫల్యమే అసలు సాఫల్యం అన్న చింతనతో పూర్తి జీవితం గడపాలి.

అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో ప్రారంభంలోనే ఈ తఖ్వా గురించే వివరించాడు. అగోచరాలపై విశ్వాసం, మనో, శరీరాలతో నమాజ్ రూపంలో దాస్యం, ఆయన ప్రసాదించిన దానిని ఆయన మార్గంలోనే ఖర్చుచేయడం, ధర్మ అధర్మాల గీటురాయి కోసం వహీ (దైవవాణి)ని, పరలోకాన్నీ విశ్వసించడం.

అల్లాహ్‌ను తన ప్రభువుగా ప్రకటించిన తరువాత కూడా శరీరం, ప్రాణాల శక్తుల్ని తన సమయాన్ని ధనాన్నీ ఆయనకు నచ్చని మార్గాలలో వెచ్చించి, ఆయన ఆగ్రహాగ్నిని ప్రజ్వరిల్ల చేసే విషయాలకు దూరంగా తొలగనివాడు తఖ్వాను కోల్పోతాడు. తఖ్వా అంటే కేవలం బాహ్య ఆచారాల పాటింపు కాదు. మనలోని అంతర్గత శక్తి, నమ్మకాల పేరే తఖ్వా. అందుచేతనే దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒకసారి తన గుండె వైపు సైగ చేసి చూపిస్తూ అన్నారు. "తఖ్వా అయితే ఇక్కడుంటుంది" (ముస్లిం, అబూహురైరా)

తఖ్వా మరియు ఉపవాసాల సంబంధం

తఖ్వా యొక్క ఈ అర్థాన్ని మీ మస్తిష్కంలో ఉంచుకుంటే ఈ విషయాన్ని గ్రహించడం కష్టం కాదు. అది తఖ్వా పుట్టించడానికి రోజా, రాత్రిళ్ళు నిలబడటం, ఖుర్ఆన్ పారాయణం కన్నా ప్రభావపూర్వకమైన ఫార్ములా కంటే మరో ఫార్ములా దొరకడం బహుకష్టం. ఈ ఫార్ములా ఉపయోగించడానికి రమజాన్ మాసమే అత్యంత సముచిత మాసం. ఉపవాసం మరియు రాత్రి నమాజ్‌లో ఖుర్అన్ పఠనం, రెండింటినీ రమజాన్ మాసంలో జమ చేసి అల్లాహ్, వాస్తవానికి తఖ్వా పొందే మార్గాన్ని మనకోసం తెరచి వేశాడు.

మనం ఉపవాసం పాటించినపుడు, ఉదయం నుండి సాయంత్రం వరకు మన శారీరక ధర్మబద్ధ కోరికల్ని సయితం ఆకలి దప్పుల వంటి కోరికల్ని సయితం పూర్తిచేయకుండా అల్లాహ్ కోసం ఆపివేసుకుంటున్నాం. ఇంకా ఆయన ప్రతిఫలం, బహుమానం కోసం మన ధర్మబద్ధ కోరికల్ని కూడా త్యాగం చేస్తున్నాం. రాత్రి రాగానే నిలబడి ఆయన వాణిని వింటున్నాం. నెల మొత్తంలో కనీసం ఒకసారి పూర్తి గ్రంథాన్ని వింటున్నాం. మన దురదృష్టప శాత్తూ భాష తెలియక పోవడం, శ్రమ పడకపోవడం వలన, అల్లాహ్ మనతో

ఏమంటున్నాడో, మనం ఏమంటున్నామో మనకు అర్థం కాదు. కాని దైవాభీష్టం మిక్కిలి స్పష్టంగా ఉంది. ఈ మాసంలో మనం ఒకసారి ఖుర్‌ఆన్ రూపంలో మనకు ప్రసాదించిన ఈ పూర్తి సద్బోధను ఆకళింపు చేసుకోవాలి. ఆ ప్రకారంగా స్వయంగా ఆచరిస్తూ, దానివైపు ఇతరుల్ని పిలవడం మన ప్రప్రథమ కర్తవ్యం. ఖుర్‌ఆన్ పారాయణంతో జ్ఞానం, విశ్వాసం లభిస్తాయి. ఉపవాసంతో ఆచరణా శక్తి లభిస్తుంది.

ఉపవాసంలో అల్లాహ్ అనుజ్ఞ లభించినపుడు మనం భుజిస్తున్నాం. ఆయన ఆదేశం అయినప్పుడు భుజించడాన్ని ఆపివేస్తున్నాం. తినడమూ హరాం కాదు, త్రాగడమూ హరాం కాదు. కాని ఉపవాసంలో మనం బొత్తిగా ప్రాథమిక అవసరాల్ని కూడా దైవవిధేయత కోసం మనపై హరాం చేసుకుంటున్నాం. ఇతర వేళల్లో వాటిని పూర్తిచేయడం ధర్మ సమ్మతం మాత్రమే కాక విధిగా చేయవలసి ఉంటుంది. వాటి కోసం మన అవసరం, కోరికా ఎంత తీవ్రమైనవి అయి నప్పటికీ అవి మనకు ఎంతగా సరైనవిగా, ధర్మసమ్మతంగా కనిపిస్తున్నా సరే, అల్లాహ్ నిరోధించిన ప్రతి విషయాన్నీ నిరోధించుకునే శక్తిని జనింప చేసు కుంటున్నాం.

రోజా వలన మన ఈ నమ్మకం కూడా బలీయమవుతుంది. భౌతికమూ, ఇంద్రియ సంబంధమూ కాని ఏ వాస్తవాల వార్తనైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఇచ్చారో, అవి ఆకలిదప్పులు, శారీరకవాంఛ వంటి భౌతిక వాస్తవాల కంటే ఎంతో ఉన్నతమూ, అమూల్యమూ, మధురమూ అయినవి. మనం కేవలం తిండితోనే జీవించం. ఉన్నత సుగుణాలు, లక్ష్యాలు జీవితానికి తప్పనిసరి అయినవి. ఈ విధంగా, తరువాత లభించే ఉన్నత ఆధ్యాత్మిక నైతిక లక్ష్యాల కోసం, ఇప్పుడే వెంటనే అనుభవించగల ఆ ప్రాపంచిక సుఖాల కోరికను త్యాగం చెయ్యగల శక్తి మనలో జనిస్తుంది.

అసలు విషయం దైవవిధేయతే అన్న విషయాన్ని కూడా ఉపవాసం బలీయం చేస్తుంది. కేవలం దైవాదేశమే ఒక విషయం సరయినదీ, సరికానిదీ అనడానికి ఆఖరి ధృవీకరణ పత్రం. తినడంలోనో, పస్తుండటంలోనో మెలకువగా ఉండటంలోనో, నిద్రించడంలోనో పుణ్యంగానీ-సత్కార్యంగానీ

లేవు. సత్కార్యం, పుణ్యం కేవలం అల్లాహ్ పట్ల విధేయత, ఆయన ఆజ్ఞా పాలనలో ఉన్నాయి. రాత్రిళ్ళు నిలబడటం వల్ల కూడా ఈ తరహా శక్తులు లభించగలవు.

ఈ శక్తులు, పరిస్థితులు జనించినప్పుడు, ఎంతగా ఇవి జనిస్తాయో అప్పుడే అన్నే ముఖ్యమయినవి వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ ఒక జాతిగా ఖుర్ఆన్ అప్పగింత భారాన్ని మోసే యోగ్యతను సంతరించుకుంటాయి. ఎందుకంటే అప్పుడే మనలో మన లక్ష్యాలను, ఖుర్ఆన్ యొక్క మిషన్ పరిపూర్తిని, భౌతిక అనుభూతికి అందే విషయాల కోరికలు, వెంటనే ప్రత్యక్ష మైన, కచ్చితమైన మాధుర్యాల కోరికపై, ప్రాముఖ్యతనిచ్చే స్తోమత జనిస్తుంది. ఈ యోగ్యత పేరే తఖ్వా.

మరొక కోణంలో (విధంగా) చూడండి. ఉపవాసానికి బాహ్యపరమైన రూపం, ఆకారం లేదు. మన స్వయాన్ని కడుపు లోపలి నుంచి పుట్టుకొచ్చే ఆకలి, దాహం, లైంగిక కోర్కెల్ని ఇతరులెవరూ చూడనూ లేరు. అనుభూతికీ లోనవ లేరు. ఎవరూ ఎవరి భావనలోనూ తోడవలేరు. ఈ కోరికల్ని త్యాగం చేసే బాహ్య స్వరూపం కూడా ఏదీ లేదు. కాబట్టి ఈ కోరికల్ని త్యజించడాన్ని భౌతిక కొల పాత్రలతో కొలవడం, తూయడం సాధ్యం కాదు. ఉపవాసం అయితే కేవలం దైవం ఉన్నాడనే నమ్మకంపైనే నిలబడుతుంది. దాన్నే బలీయం చేస్తుంది. దాని పరమార్థం ఇదే- అల్లాహ్ అన్ని వేళలా వెంట ఉన్నాడు. ఎక్కడున్నా ఆయనుంటాడు. ఇద్దరున్న చోట మూడవ వాడు ఆయన. ఒంట రిగా ఉంటే రెండవవాడాయన. ఆయన మనకు మన కంఠనాళం (బృహద్ధ మని) కంటే దగ్గరగా ఉన్నాడు. ఇదే ఆ విశ్వాసం. ప్రతిక్షణం తన ప్రభువు ఎదుట ఉండటంపై విశ్వాసం. ఇదే ఉపవాసం యొక్క అసలు ఫలితం. అందుచేతనే హదీసె ఖుదుసీలో సెలవియ్యబడింది. "ఉపవాసం కేవలం నా కోసమే. నేను మాత్రమే దానికి ప్రతిఫలం ఇవ్వగలను" (బుఖారీ ముస్లిం; అబూహురైరా) తఖ్వా ఈ ప్రాతిపదిక పైనే కలుగుతుంది. ఈ విశ్వాసంతోనే ఆహారం పొందుతుంది. దానిపైనే వృద్ధి వికాసాలు పొందుతుంది.

ఇక చివరలో మరో ముఖ్య విషయం చెప్పమంటారా? ఇంతటి అపూర్వ ప్రయోజనం, ఇంతటి అపారమయిన లాభాన్ని చేకూర్చే ఫార్ములాని వదలుకోవడానికి మనం ఇష్టపడకపోతే ఇందుకు షైతాను నిరాశ చెంది ఇక దాని లాభాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తాడు. మనం మహా సముద్రం నుండి కొన్ని బొట్లు పొందటంతోనే సరిపెట్టుకుంటాం అన్నమాట. ఉపవాసాలు, రాత్రి నమాజుల ద్వారా మీరు చూపిన తఖ్వా కూడా పొందగలరు. మనం కొన్ని చిన్న సత్కార్యాలు చేయడంతో సరిపెట్టుకునే తఖ్వా కూడా జనించవచ్చు. ముస్తహబ్‌ల చింత నఫిల్‌ల కంటే మిన్నగా చేసే, నఫిల్‌లు సున్నత్‌లను మించే, ఇవన్నీ ఫరజ్‌లను మించి ఈ విధంగా మనం చిన్న పాపాల నుండి ఆగిపోవాలి.

కాని అల్లాహ్ రమజాన్ మాసంలో ఉపవాసాలు విధిగా చేసి ఎటువంటి తఖ్వా జనింప చేసేందుకు ఇచ్చిన శిక్షణ ఉంటే, అది ఇంతకన్నా గొప్ప విషయం. ఈ తఖ్వా ద్వారా మనం వ్యక్తిగత స్థాయిలో జమాఅత్ స్థాయిలో రమజాన్‌లో ఖుర్‌ఆన్ యొక్క మిషన్‌ను పూర్తి చేయడానికి, దాని హక్కును నెరవేర్చడానికి తగినవారం కాగలం. ఈ విషయం తెలుసుకోవడం అవసరం. ఎందుకంటే ఉపవాసాలు పాటించేవారు, ఉపవాసాలు పాటిస్తూ ఉన్నారు. రాత్రిళ్ళు మేల్కొనే వారు, రాత్రుల్లో మేల్కొంటు ఉంటారు. కాని రమజాన్ ఉపవాసాలు, ఖుర్‌ఆన్ పారాయణం వారిని నడపగోరే మార్గంలో వీరు ఒక్క అడుగూ ముందుకు వేయగోరడం లేదు. ఇలా జరుగుతూ వచ్చింది, ఇలా జరుగుతుంది కూడా. మనం ఖుర్‌ఆన్ హక్కు నెరవేర్చడానికి, ఇతర అల్లాహ్ దాసులను ఖుర్‌ఆన్ చూపిన మార్గంపై నడిపించేందుకు మనల్ని మనం సంసిద్ధుల్ని చేసుకోవడం, ఆచరణాత్మకంగా ఎంతో కొంత చేయడమే, వాస్తవానికి సత్కార్యాలలో కెల్లా గొప్ప సత్కార్యం, ఫరజ్‌లలో అన్నింటికన్నా పెద్ద ఫరజ్, లాభం రీత్యా అన్నింటికన్నా ఎక్కువ మేళ్ళను పొందే మార్గం.

మనం ఖుర్‌ఆన్ పఠనం, రమజాన్ ఉపవాసం, తఖ్వాల మధ్యగల సంబంధాన్ని బాగా అర్థం చేసుకున్నప్పుడే ఈ బాధ్యతను నెరవేర్చే ఆలోచన మనలో కలుగుతుంది. ఇప్పటి వరకూ జరిగిన నా సంభాషణ లక్ష్యం ఇదే.

రమజాన్ మాసం ఉపవాసాల కోసం. ఈ మాసంలో దైవవాణి అవతరించిన కారణంగానే విధిగా చేయబడిందనీ, ఈ మాసంలోని సకల శుభం, ఘనత ఇందుకోసమే. ఈ మాసంలో ఆయన తన దాసులకు సన్మార్గం చూపదల చాడు. ఇంకా తన కారుణ్యంతో తన హితబోధ యొక్క ఆఖరి సందేశం తన ప్రవక్త (సల్లం) ద్వారా ప్రపంచ ప్రజలకు అప్పగించాడు. ఈ మాసంలో ఉపవాసం విధిగా చేయడంలోని ఉద్దేశ్యం, మనం మనలో దైవగ్రంథంపై గల హక్కును చెల్లించే శక్తి, స్తోమత లభించాలనే.

మీరేం చెయ్యాలి?

రమజాన్ మాసంతో అత్యధికంగా లాభం పొందగలగడానికి, ఉప వాసాలతో, తరావీహ్‌తో, ఖుర్‌ఆన్ పారాయణంతో, ఆరాధనలూ నిత్యకృత్యా లతో, రాత్రులతో, పగళ్ళతో తఖ్వా శక్తి స్తోమతల్ని పొందటానికి మీరేం చెయ్యాలి? ఇప్పుడు నేను మీ ఈ ప్రశ్నకే జవాబిచ్చే ప్రయత్నం చేస్తాను.

1. సంకల్పం, ఉద్దేశ్యం

మొదటి విషయం సరయిన సంకల్పం, పక్కా ఉద్దేశ్యం- సంకల్పం, స్ఫూర్తి భావననే పుట్టిస్తుంది. దాన్ని చైతన్యవంతం చేస్తుంది. స్ఫూర్తి చైతన్యవంతం అయితే ఉద్దేశం జనిస్తుంది. ఉద్దేశ్యం శ్రమ, ప్రయత్నాల రూపంలో వెలువడుతుంది.

ఒక పనికోసం ఉద్దేశం యొక్క నిజమయిన స్ఫూర్తి, దాన్ని సాధించ డానికి దృఢ నిశ్చయం శరీరానికి ఆత్మలాంటివి. ఈ భావంలోనే నమాజ్, రోజా, ఆరాధన కోసం నియ్యత్ చేసుకోవాలని తాకీదు చేయబడింది. కొందరు ఉలమాల దృష్టిలో నోటితో నియ్యత్ పదాలు ఉచ్చరించని ఆచరణ సక్రమం కాజాలదు. కొందరు దృష్టిలో మనసులో చెప్పుకుని నిర్ణయించుకుంటే సరి పోతుంది. కాని కేవలం నియ్యత్ పదాలు పలికినందువల్ల లేక మనసులో ఏదయినా ఆచరణ చేసేందుకు నియ్యత్ చేసుకోవడం వల్ల ఫికహ్ పరంగా

చట్టపరంగా షరతు అయితే పూర్తి అవుతుంది. అయితే ఈ నియ్యత్ ఆచరణకు ఆత్మ యొక్క పని, ఈ మనోమస్తిష్కాలలో ఆచరణ యొక్క లక్ష్యాన్ని జాగృతం చేసి, మనసులో ఈ లక్ష్యసాధనకు స్థిర నిశ్చయం తీసుకున్న పక్షంలోనే చేయగలుగుతుంది.

సజీవ, నిర్జీవ శరీరాలలో ప్రత్యక్షంగా తేడా ఏమీ ఉండదు. కాని సజీవ శరీరం కదలిక, ఆచరణల శక్తి కలిగి ఉంటుంది. మృత శరీరానికి కదలిక, ఆచరణల శక్తి లోపిస్తుంది. ఆచరణల పరిస్థితి అంతే. ఆచరణల్లో సరయిన నియ్యత్ ఆత్మయికంగా ఉంటే అది సృష్టి ప్రభావం, వికాసం, ఫలితాన్ని రాబట్టగల శక్తి అవి కలిగి ఉంటాయి. ఈ విషయాన్నే దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు; "ఆచరణల్లో సక్రమత, బరువు, నియ్యత్ (సంకల్పం)పై ఆధారపడి ఉంటాయి." ఇన్నమల్ ఆమాలు బిన్నియాత్ (బుఖారి, అన్‌ఉమర్) ప్రతి మనిషికీ తాను నియ్యత్ చేసుకున్నదే లభిస్తుంది.

నియ్యత్ నిజమయినదయి ఉండాలి. అందులో స్వచ్ఛత కూడా ఉండాలి. అంటే ప్రతి పనీ కేవలం దైవప్రసన్నత కోసం జరగాలి. ఆయన బహుమానం పొందటం కోసం చెయ్యాలి. మీ నియ్యత్ స్వచ్ఛమయినది కాకపోతే, మీ పని కేవలం అల్లాహ్ కోసం చేయకపోతే అది స్వీకరించబడదు. మీ శ్రమకు ఫలితం వృధా కావచ్చు.

నియ్యత్, ఆచరణల కోసం కోరిక ఉండాలి. కోరిక లేకపోయినట్లయితే నియ్యత్ దానిని పుట్టిస్తుంది. కోరిక ఉంటే దీక్ష, ఉత్సాహం పుడతాయి. నిశ్చయం, దీక్షా ఉత్సాహాలే మనల్ని కర్తవ్యోన్ముఖం చేసే శక్తులు. అవే మనలో చలనం పుట్టిస్తాయి. ఏదైనా ప్రయాణానికి ప్రాథమిక లక్షణాలు ఇవే. రమజాన్ ప్రయాణం కూడా మిమ్మల్ని మీ గమ్యానికి చేర్చజాలదు.

రమజాన్‌ను స్వాగతించడానికి మీరు చేయవలసిన మొట్టమొదటి పని, మీరు రమజాన్ సందేశం, దాని లక్ష్యం, దాని ఘనతా శుభాల భావన మీలో తాజాగా ఉండాలి. ఈ మాసంలో మీరు ఏ నిత్యకృత్యాలను, ఏ ఆరాధనలను శ్రద్ధ తీసుకొని చేయగలరో వాటి ద్వారా రోజా ఫలితం అయిన

తఖ్వాను జనింప చేసుకునే ప్రయత్నం చేసే నియ్యత్ చేసుకోవాలి. మీరు దైవధర్మం కోరే వాటిని ఖుర్‌ఆన్ మిషన్‌ను పూర్తి చేయగల సమర్థుల్నిగా చేయగలగాలి. ఇంకా ఈ మాసంతో సంపూర్ణ ప్రయోజనం పొందడానికి అల్లాహ్ విధిగా నిర్ణయించిన, దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చిన, మీరు మీ కోసం నిర్ణయించుకున్న నిత్యకృత్యాల ఆచరణకు స్థిర నిశ్చయం గైకొనాలి. వీటన్నింటిని మీరు సక్రమంగా ఆచరించే పూర్తి ప్రయత్నం చేయాలి.

ఈ లక్ష్యం కోసం, రమజాన్ మాసం ఆరంభానికి ముందే, చివరి దినంలో లేదా ఆరంభమయిన వెంటనే మొదటి రాత్రిలోనే రెండు ఘడియలు ఒంటరిగా కూర్చుని, మీరు అల్లాహ్ సమక్షంలో ఉన్నారని భావించడం, ఆయన్నే స్తుతించడం, ప్రవక్త (స)కు దరూద్ పంపడం, మీ పాపాలకు ఇస్తిగ్‌ఫార్ (మన్నింపు దుఆ) చేసుకోవడం శ్రేష్టమయిన కార్యం. ఆ తర్వాత రాబోయే మాసాల విషయంలో ఇక్కడ సూచించబడిన విషయాలన్నింటి గురించి ఆలోచించండి (లేదా ఈ రాతల్నే చదువుకోండి) ఆ తర్వాత పూర్తి మాసం కోసం ప్రయత్నం, శ్రమ చేసే నియ్యత్ చేసుకోండి. అల్లాహ్‌ను సద్బుద్ధి, సహాయం కోరండి. ఆయన మీ చెయ్యి పట్టుకొని మిమ్మల్ని ఆయన మార్గంలో నడిపించాలని దుఆ చేయండి.

దివ్య ఖుర్‌ఆన్‌తో సంబంధం

రెండో విషయం, ఖుర్‌ఆన్ పారాయణం, దాని జ్ఞానార్జన కోసం ఏర్పాటు చేసుకోవడం. పవిత్ర రమజాన్ మాసం తన ప్రత్యేక ఆరాధనల్ని అంటే ఉపవాసం, రాత్రి నమాజులను ఏదో ఒక రూపంలో ఖుర్‌ఆన్‌పై కేంద్రీకరింపచేస్తుంది. ఈ మాసంలో సంపాదించవలసింది ఖుర్‌ఆన్ శ్రవణం, పఠనం, ఖుర్‌ఆన్‌ను అభ్యసించడం అందుకు స్తోమత సంపాదించడమే. కాబట్టి మీరు అత్యధికంగా ఖుర్‌ఆన్ సహచర్యంలో సమయం గడపాలి. ఒకవైపు అల్లాహ్ మీతో ఏమన్నాడో, మీకూ తెలియాలి. రెండో వైపు మీ హృదయం, మీ ఆలోచన ఖుర్‌ఆన్‌ను జీర్ణించుకునే, ఆ ప్రకారం మీలో ఆచరించేందుకు ఆమోదం జనించాలి అన్నట్లుగా కాలం గడపాలి.

సక్రమ పాటింపుతో తరావీహ్ నమాజ్ వలన ఒకసారి మీరు పూర్తి ఖుర్‌ఆన్‌ను వినడం కనీస స్థాయిలో తప్పక జరిగే పని. అల్లాహ్ సమక్షంలో నిలబడి, దైవవాణి వినడం వల్ల ఒనగూడే ప్రయోజనం బహు విలువయినదే. కాని అరబీ భాష తెలియని కారణంగా మీరు ఖుర్‌ఆన్ సందేశం, దాని వ్యాసాలను గురించి తెలుసుకునే వాటిని తాజా చేసుకునే ప్రయోజనం మాత్రం పొందలేరు. అందుకోసం మీరు కాస్త ఎక్కువ శ్రమ తీసుకోవడం అవసరం. మీరు తరావీహ్ కోసం కాస్త ఎక్కువ సమయం ఖుర్‌ఆన్ కోసం వినియోగించాలి. అంటే ప్రతి రోజూ ఖుర్‌ఆన్‌లోని కొంత భాగం అనువాదంతో అర్థం చేసుకుని చదివే ప్రయత్నం చేయాలి.

రమజాన్ మాసంలో దివ్య ఖుర్‌ఆన్ చదవటం ఒకసారి పూర్తి చేసేట్లుగా ప్రతిరోజూ కొద్ది కొద్దిగా చదవాలి. ఈ మాసంలో జిబ్రయీల్ అలైహిస్సలాం వచ్చి, దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు ఒకసారి పూర్తి ఖుర్‌ఆన్ వినిపించేవారని హదీసుల ద్వారా తెలుస్తోంది. (బుఖారీ, ముస్లిం: ఇబ్నె అబ్బాస్) కాబట్టి అన్నింటికన్నా ఉత్తమం, రోజూ ఒక పార (ఒక కాండం) తరావీహ్‌లో వింటుంటే అదే రోజు మీరు ఒక కాండాన్ని తర్జుమాతో చదవాలి. అయితే ఈ పని అందరూ చేయాలంటే కాస్త కష్టమే.

ఖుర్‌ఆన్ బలహీనులకు ఈ విషయంలో వెసులుబాటునిచ్చింది. ఈ బలహీనత వ్యాధి కారణంగా గానీ, ఉపాధి అన్వేషణల వల్లగాని లేక దైవమార్గంలో ఇదికూడా చెప్పబడింది. ఎంత మేరకు సులభంగా చదవగలరో అంతమేరకు చదవండి అని **"ఫ అఖ్ రవూ మాతయస్సర మినల్ ఖుర్‌ఆన్'** కాబట్టి మరో మార్గం కూడా ఉంది. రాబోయే రమజాన్ మొదటి తేదీ నుండి మీరు ఖుర్‌ఆన్‌ను అనువాదంతో చదివే పని ప్రారంభించాలి. ఈ లక్ష్యం కోసం ప్రతి రోజూ ఒకటి లేక ఒకటిన్నర రుకూల కన్నా ఎక్కువ చదవవలసిన పనిలేదు. ఈ మాత్రం సమయం కేటాయించడం రమజాన్‌లో ఏమంత కష్టకార్యం కాదు. రమజాన్ తర్వాత కూడా. సక్రమంగా ఇంత చేయడం కూడా కష్టమని అనిపిస్తే మీరు ఈ రమజాన్ నుండి కనీసం మూడు ఆయత్‌లు ప్రతిరోజూ తర్జుమాతో సహా చదవడం ఆరంభించండి. ఈ విధంగా ఒక సంవత్సరంలో కాకపోయినా అయిదారేళ్ళలో ఒకసారి ఖుర్‌ఆన్ చదవడం

పూర్తి చేయగలరు. ఈ పని ఈ రమజాన్ నుండే ఆరంభించినట్లయితే దైవకారుణ్యం మీ వెంట ఉండగలదు.

అర్థం చేసుకుని చదవడంతో పాటు మీరు ఖుర్‌ఆన్ సారాన్ని ఆకళింపు చేసుకోవడం కూడా అవసరమే. దీంతో పాటు మీ హృదయం ఆత్మల సంబంధాన్ని లోతయిన సంబంధాన్ని వృద్ధి చేయండి స్వయంగా ఖుర్‌ఆన్ తనను చదివే, వినే వారి లక్షణాల్ని వివరించింది. అది కేవలం మేధస్సుతో అర్థం చేసుకుని చదవడం వరకే పరిమితం కాదు. ఈ విధంగా ఎందరో ముస్లిమేతరులు కూడా చదువుతారు. పైగా ఆత్మ, హృదయం ఇంకా శరీరం సమిష్టిగా పాల్గొనడం పైచేయిగా ఉంటుంది. ఖుర్‌ఆన్ ఆయతులు పఠిస్తున్నప్పుడు పఠించే, వినేవారి హృదయాలు కంపిస్తాయి, మెత్తబడతాయి. వారి శరీరాలు రోమాంచితాలవుతాయి. వారి కళ్ళ నుండి అశ్రుధారలు ప్రవహిస్తాయి. వారి విశ్వాసం పెరిగిపోతుంది. ఈ విషయం స్వయంగా ఖుర్‌ఆనే పేర్కొన్నది. దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూడా సెలవిచ్చారు. ఖుర్‌ఆన్ చదవసాగినప్పుడు కన్నీరు కార్చండి.: ఏడుపు రాకపోతే ఏడ్చే ప్రయత్నం చెయ్యండి. ఖుర్‌ఆన్ దుఃఖంతోపాటే అవతరింప చేయబడింది కనుక.

మీరు కొద్దిగా చదివినా అల్‌ఖారిఅ చదవండి. అది గడగడలాడించే యాతన గురించి తెలియచేస్తోంది. లేదా జిల్‌జాల్ చదవండి. మీ ప్రతి చిన్నపాపం, ప్రతి చిన్నపుణ్యం మీ ఎదుటకు వస్తుందన్న వార్త తెలియ జేస్తుంది. అందులో పూర్తిగా లీనమయి మీరు అల్లాహ్ ఎదుట ఉన్నారన్న భావనతో చదవండి. ఆయన మీతో మాట్లాడుతున్నట్లుగా, మీరేం చెయ్యాలి ఏం చెయ్యకూడదు ఏమి కానున్నదో తెలుపుతున్నట్లుగా చదవండి. మీ మనో వాక్ కర్మలు ఈ పనిలో విలీనం అయినట్లుగా చదవండి.

దైవ అవిధేయత నుండి కాపాడుకోవడం

మూడో విషయం, అల్లాహ్ అవిధేయత నుండి రక్షణ పొందే ప్రత్యేక ప్రయత్నం. అదే ఉపవాసం లక్ష్యమైన తఖ్వా. రమజాన్ మాసం తఖ్వా

పెంపొందే వసంతం. కనుక ఈ మాసంలో అల్లాహ్ అవిధేయతకు దూరంగా మసలుకోవాలి. దీని అర్థం రమజాన్ మాసం తప్ప మిగతా దినాలలో అల్లాహ్ అవిధేయత నుండి కాపాడుకొనే ప్రయత్నం చేయకూడదని కాదు. రమజాన్‌లో ఖుర్‌ఆన్‌తో ప్రత్యేక సంబంధం కలిగివుండి, అల్లాహ్ ఆజ్ఞాపాలనలో పగలంతా ఆకలిదప్పులతో ఉపవాసాలు పాటిస్తూ, రాత్రులలో తరావీహ్ నమాజ్ చేస్తూ ఉండటం ద్వారా ప్రత్యేక వాతావరణం నెలకొంటుందని దీని భావం. ఈ వాతావరణంలో మీరు అల్లాహ్‌కు ఆగ్రహం కలిగించే ప్రతి విషయం నుండి కాపాడుకోవాలన్న ఉత్సాహం ఉరకలు వేస్తుంది.

ఇలా జీవితంలోని ప్రతి రంగంలో చేయవలసిందే. ముఖ్యంగా తోటి మానవులతో సంబంధాలు, సామాజిక సంబంధాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఎంతో పకడ్బందీగా ఉపవాసాలు పాటించి, నమాజ్ చేసి దానాలు చేసి, ఖుర్‌ఆన్ పఠించినప్పటికీ, అంతిమ దినాన దేవుని సమక్షంలో ప్రజల ఫిర్యాదుల వెల్లువతో నిలబడేవాడు ఎంత దౌర్భాగ్యుడు?

అతను ఒకరిని కొట్టిఉంటాడు, ఒకరిని తిట్టిఉంటాడు. ఒకర్ని అవమానపరచి ఉంటాడు, మరొకరి మనసు నొప్పించి ఉంటాడు. వేరొకరి సొమ్ము అన్యాయంగా కబళించి ఉంటాడు. దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారు: 'నా ఉమ్మత్‌లో ఇలాంటివాడే అసలైన దరిద్రుడు. అతడి సత్కర్మలన్నీ ఫిర్యాదు చేసినవారికి ఇవ్వబడతాయి. ఫిర్యాదులు ఇంకా మిగిలిపోతే ఫిర్యాదు చేసినవారి పాపాలు అతడి నెత్తిన పడతాయి. చివరికి అతడ్ని ఈడ్చుకుపోయి నరకంలో విసిరేయడం జరుగుతుంది. (ముస్లిం: అబూహురైరా)

మీరు ఖుర్‌ఆన్‌లో ఉపవాసం విధిగా చేయబడిన ఈ నేపథ్యాన్ని చూస్తారు. వెంటనే ఉపవాసం ద్వారా పొందవలసిన ప్రాథమిక లక్ష్యం ఇదేనని గ్రహిస్తారు. ఖుర్‌ఆన్ మొదట మానవ ప్రాణానికి గౌరవం, పరిహారాలకు, ఆ తర్వాత వారసులకు న్యాయబద్ధంగా వీలునామా ప్రకటించమని ఆదేశిస్తుంది. దీని తర్వాత ఉపవాసం మరియు రమజాన్ గురించి ప్రసంగం ఉంటుంది. మరుక్షణంలోనే ఒకరి సొమ్ము మరొకరు అన్యాయంగా తినకండని బోధించ బడుతుంది. తిరిగి విశ్వసనీయత, సత్కార్యాలు అంటే బాహ్యాపరమైన చర్యలు

కాదని, వాటి అసలు అర్థం తఖ్వా (దైవభీతి పరాయణత) అని మీరు తెలుసుకుంటారు. విశ్వాసం, ప్రేమ, దానం మరియు సహనం వంటి విషయాల పేరే అది. ఆ తర్వాత ఖుర్‌ఆన్ దైవమార్గంలో పోరాడే ఆదేశమిస్తూ దౌర్జన్యానికి పాల్పడేవారిని అల్లాహ్ ప్రేమించడని హెచ్చరించింది. కనుక యుద్ధరంగంలో కూడా దైవభీతి పరాయణత (తఖ్వా) కలిగివుండాలి.

ఈ ఆదేశాల పరంపరలో రోజా ప్రస్తావన ఎక్కడ వచ్చిందో గమనిస్తే ఉపవాసం పాటించిన తర్వాత మీరు తోటి మానవుల ధన మాన ప్రాణాలపై చేయి ఎత్తకూడదని తెలుస్తుంది. ఇదే విషయాన్ని దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: "పాపాల నుండి రక్షణకు రోజా ఢాలు వంటిది. కనుక దానిని ఢాలుగా చేసుకోండి. ఉపవాసి దుర్భాషలాడటంగానీ కేకలు వేయడంగానీ చేయకూడదు. ఒకవేళ ఎవరైనా అతడ్ని తిట్టినా, తగవులాడినా నేను ఉపవాసం ఉన్నాను అని చెప్పి అక్కడ్నించి తప్పుకోవాలి.

(బుఖారీ, ముస్లిం: అబూ హురైరా)

ఒక విషయం గుర్తుంచుకోండి. ఉపవాసమంటే ఉదరానికి మాత్రమే ఉపవాసం కాదు. కంటికీ ఉపవాసం ఉంది. చెవికీ ఉపవాసముంది. నోటికీ ఉపవాసముంది. కాళ్ళుచేతులకూ ఉపవాసముంది. అంటే అల్లాహ్‌కు ఇష్టం లేనిదానిని ఆయన వారించిన దానిని మన కళ్ళతో చూడకూడదు, చెవులతో వినకూడదు, నోటితో పలక్కూడదు, దాని కోసం కాళ్ళుచేతులకు పని కల్పించకూడదు.

ఇలా ఒక్కొక్కటిగా మన దోషాలను అదుపు చేసుకుంటే ఎంతో పని అయిపోగలదు. ఉదాహరణకు రాబోయే రమజాన్ కోసం మీరు ఎవరినీ కేకలు వేయకూడదని, పోట్లాడరాదని, ఎవరి గురించీ చెడు పలక్కూడదని నిర్ణ యించుకోండి. ఇది కష్టమే కాని దానిని పాటించడం వలన అన్ని పనులు చక్కబడే, మన పుణ్యాలన్నీ నాశనం కాకుండా రక్షించుకునే ప్రయోజనాలు ఒనగూడుతాయి. ప్రతి రోజూ రాత్రి ఈ రెండు విషయాలూ లెక్క చూసుకోండి. ఏదైనా తడబాటు కలిగితే వెంటనే ఇస్తగ్‌ఫార్ చెయ్యండి.

సత్కార్యాన్వేషణ

నాలుగో విషయం, అన్ని రకాల సత్కార్యాల అన్వేషణ. ప్రతి క్షణం, అన్నిరకాల సత్కార్యాల్ని కోరటం, అన్వేషించడం విశ్వాస స్వభావంలోని భాగమే. అయితే రమజాన్ మాసంలో ఈ విషయం గురించి కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మీరు ఏ సత్కార్యం ద్వారా దైవప్రసన్నత అన్వేషిస్తారో అందుకు ప్రతిఫలం ఫర్జ్‌కు సమానంగా లభించే మాసం ఇది. (బైహఖీ; సల్మాన్ ఫార్సీ) ఇంతకు మించిన శుభవార్త మరేముంది?

ఈ అన్వేషణ ఆచరణ పరిధిలోనూ చేయాలి. ఉదాహరణకు తక్బీరె తహరీమాను గౌరవించడం. నఫిల్ నమాజుల పాటింపు. ఈ అన్వేషణ మానవ సంబంధాల పరిధిలోనూ జరగాలి. మీ సోదరున్ని చిరునవ్వుతో కలుసుకోవడం కూడా దానమే. అతడికి బాధ కలిగించకపోవడమూ దానమే. అతని చేదలో నీళ్ళు పొయ్యడమూ దానమే. ఫర్జ్, నఫిల్ మాటలు విని మీరు నమాజ్, రోజాలను గురించి మాత్రమే ఆలోచిస్తారు. కాని జీవితంలోని ప్రతి రంగం లోనూ ఫర్జ్‌లు, నఫిల్‌లు ఉంటాయి సుమా!

ఒక దాసుడు ఫర్జ్‌లు పూర్తి చేసిన తర్వాత నఫిల్‌లు కూడా పాటిస్తాడు. అంటే తన ఆసక్తిని, కోరికను అనుసరించే చేస్తాడు. నఫిల్ కార్యాలు చేయక పోతే అతడ్ని ప్రశ్నించడం అనేది ఉండదు. దాసుడు తన ఆసక్తి మేరకు పరుగులతో తన ప్రభువు అనుగ్రహం సంపాదించడానికి ఈ పనులు చేస్తాడు. దొరికిన ఏ అవకాశమూ చేజారనీయకుండా ప్రయత్నిస్తాడు. అటువంటివానికి ఆ హదీసె ఖుదుసీ వర్తిస్తుంది. అందులో అల్లాహ్ సెలవిచ్చాడు: "నేను అతడ్ని ప్రేమించ సాగుతాను. నేను అతడు వినే చెవిని అయిపోతాను. అతడు చూసే కన్ను అయిపోతాను. ఇంకా అతడు నడిచే కాళ్ళు అయి పోతాను." (బుఖారీ: అబూహురైరా)

ఈ విషయంలో ఏవైనా మూడు సత్కార్యాలు ప్రత్యేకంగా ఎన్నుకోండి. వాటిని రమజాన్ మాసంలో చెయ్యండి. ఉదాహరణకు మీరు నమాజ్‌ను జమాఅత్‌తో (సామూహికంగా)చేస్తాను అనీ, ఏ మానవుడికీ ఇబ్బంది కలిగించ ననీ, ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో కలుసుకుంటాననీ నిర్ణయించుకోండి.

రాత్రి నిలబడటం

రాత్రి (నమాజ్‌లో) నిలబడటం, ఖుర్‌ఆన్ పారాయణం, ఏరోజుకారోజు పాపపుణ్యాల లెక్కజూసుకోవడం ఇస్తగ్‌ఫార్ (మన్నింపు కోసం దుఆ) ఇవన్నీ తఖ్వా పొందటానికి ఎంతో అవసరం. ఇది ముత్తఖీ (తఖ్వా పాటించేవారి) లక్షణం. ముత్తఖీలంటే రాత్రి తక్కువసేపు నిద్రించేవారు, ఉదయం వేళ ఇస్తగ్‌ఫార్ చేసేవారు అని అల్లాహ్ పేర్కొన్నాడు. (అజ్జారియత్ : 51:18)

రమజాన్ మాసంలో తరావీహ్ నమాజ్ ఉన్నది రాత్రి నిలబడటం కోసమే. మీరు రాత్రి ఆరంభంలో నిలబడి ఖుర్‌ఆన్ వింటారు. ఇది రాత్రి నిలబడటమే. ఇందుకు మరోవేళ, అర్ధరాత్రి తరువాత లేదా రాత్రి మూడవ భాగంలో ఉంది. ఇది సహరీవేళ. ఇస్తగ్‌ఫార్ చేసే సమయం ఇదేనని ఖుర్‌ఆన్ తాకీదు చేసింది.

రమజాన్ మాసంలో కాస్తంత ఏర్పాటు చేసుకుని రాత్రిలోని ఈ ఆఖరు భాగంలో రాత్రి నిలబడే శుభాన్ని పొందగలరు. ముస్తగ్ ఫిరీన బిల్ అస్‌హార్‌లో మీరు చేరగలరు. దీని పద్ధతి చాలా సులభం. సహరీ కోసం మీరు ఎటూ లేస్తారు. పదిహేను లేక ఇరవయి నిమిషాలు ముందుగా లేచి ఉజూ చేసి రెండు రకాత్‌లు నమాజ్ చేసుకోండి.

రాత్రి ఈ భాగం గురించి దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: అల్లాహ్, ప్రపంచవాసులకు బహుదగ్గరగా వచ్చి "నన్ను అర్థించే వారెవరైనా ఉన్నారా? వారు కోరినదాన్ని నేనిస్తాను. తమ పాపాల మన్నింపు కోసం అర్థించే వారెవరైనా ఉన్నారా? వారిని నేను క్షమిస్తాను" అని పిలుస్తాడు. (ముస్లిం:అబూహురైరా) ఒక ఉల్లేఖనంలో మనసును తహ తహలాడించే ఈ పదాలున్నాయి: రాత్రి ఈ ఘడియలో అల్లాహ్ తన చేయి చాపుతాడు." ఫకీరుకానీ దుష్టుడుకాని వాడికి అప్పుయిచ్చేవారు ఎవరైనా ఉన్నారా?" అని అంటాడు. ఉదయం వరకూ ఇలానే అడుగుతూ ఉంటాడు. (ముస్లిం: అబూహురైరా)

అల్లాహ్ తన చేతిని ఈవిధంగా చాపివుంచగా, మీరు సహరీ భుజించ డానికి ఎలాగూ లేస్తున్నారు. మరి ఇంతకంటే సులభమైన, భాగ్యవంత మైన మార్గం మరేదుంది? మీరు కొన్ని నిమిషాలు ముందే లేవడమేగదా కావల సింది. దాంతో మీరు మీ పాపాలు క్షమింప చేసుకోవచ్చు. ఇంకా మీరు కోరింది పొందవచ్చుగదా! ఒకవేళ రెండు రకాత్‌లు నమాజ్ చేసుకోవడం కూడా కష్టం అయితే, కనీసం మీ నుదిటిని మీ ప్రభువు సమక్షంలో నేలకు అనించి ఆయన ముందు గడగడలాడుతూ, కన్నీరు కారుస్తూ, తమ పాపాలకు ఇస్తగ్‌ఫార్ చేసి, మేలు, శుభాలను అర్థించాలి. ధర్మమార్గంలో నిలకడ కోరు కోవాలి. అయిదు పది నిమిషాలలో ఇలా సులభంగా చేయవచ్చు. కాని ఒక్కసారి మీరు ప్రాతఃకాలంలో కన్నీరు కార్చటంలోని మాధుర్యాన్ని గ్రోలితే మీరు మరింత సమయం తీసుకుంటారు. రమజాన్ తర్వాత కూడా ఈ మాధుర్యం వెంటపడతారు.

జిక్ర్, దుఆ

ఆరవ విషయం జిక్ర్ (ధ్యానం), దుఆ (వేడుకోలు), దైవస్తోత్రం. దైవాన్ని వేడుకోవడం జీవితంలో ఎల్లవేళలా అవసరమే. జిక్ర్ అంటే ఏమిటి? అల్లాహ్‌కు ప్రీతికరమైన ప్రతి పనీ జిక్ర్‌యే. మనసులోగానీ, నోటితోగానీ, లేక అవయవములతో ఉపవాసం కూడా ఈ భావంలో జిక్ర్‌యే. ఆకలి దప్పులు కూడా జిక్ర్‌యే. ఇంకా ఖుర్‌ఆన్ పఠనం, ప్రత్యేకించి నమాజ్‌లోనైతే సరేసరి. ఇది జిక్ర్ యొక్క అత్యంత శ్రేష్ఠమయిన రూపం. కాని రమజాన్ మాసంలో నోటితో జిక్ర్, అంటే జిక్ర్ వచనాలను వల్లెవేయడం, దుఆ చేయడం చాలా అవసరం. ఇది నఫిల్ ఆరాధనే అయినా పుణ్యం ఫర్జ్ ఆరాధనకు సమానంగా లభిస్తుంది. దీనివల్ల ఏమరుపాటు దూరం అవుతుంది. రమజాన్ శుభాలను, మేళ్ళను పొందటానికి మనసును కేంద్రీకరించడంలో సౌలభ్యం కలుగుతుంది.

రమజాన్ మాసంలో "సుబ్‌హానల్లాహ్, లాయిలాహ ఇల్లల్లాహ్, అల్లాహు అక్బర్, సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహీ, సుబ్‌హానల్లాహిల్ అజీం, లాహౌల వలా

ఖువ్వత ఇల్లా బిల్లాహి, అస్తిగ్‌ఫిరుల్లాహ్, అతూబుఇలైహి' వంటి పదాలను పదేపదే తరచూ పలకాలి. తద్వారా నోరు దైవధ్యానంలో తడిసిపోతుంది.

జిక్రకు ఒక రూపం దుఆ చేయడం. ఏది లభించినా అల్లాహ్ నుండియే లభిస్తుంది అన్నది మన విశ్వాసం. ఇంకా మన అధికారాలు మన ఖజానాలకు అధిపతి అల్లాహ్‌యే. దుఆ చేయుడం అంటే మన ఆద్యంతాలూ అగత్యపరులమని, బికారులమనడానికి ఒప్పుదల. మనం మనల్ని కేవలం అల్లాహ్ యొక్క అగత్యపరులమని, బికారులమని భావించాలి. దాస్యానికి మూలం ఇదే. రమజాన్ మాసంలోని ప్రతిక్షణం అత్యంత ఘనమయిన మేళ్ళు, శుభాలు కలిగిఉంది. కనుక పలుమార్లు మన ప్రభువు ఎదుట చెయ్యి చాపాలి. రమజాన్‌లో సాధారణ వేళలతోపాటు దుఆ స్వీకార యోగ్యం అవటానికి ప్రత్యేక వేళలు కూడా ఉన్నాయి. వాటిల్లో ఇఫ్తార్ సమయం కూడా ఉంది. ఆ సమయంలో దైవకారుణ్యం సావధానమై ఉంటుంది.

ఈ విషయంలో రమజాన్ మొదటి దశకం (పదిరోజులు) కారుణ్యం కోసం తరచుగా ప్రార్థించే ప్రయత్నం చెయ్యండి. రెండవ దశకంలో మన్నింపు కోసం, మూడవ దశకంలో నరకాగ్ని నుండి విముక్తి కోసం ప్రార్థించండి. దైవ ప్రవక్త (సల్లం) ఈ దశకాల్లోని శుభాలు వివరించారు. (బైహఖీ: సల్మాన్ ఫార్సీ)

కాబట్టి ఈ స్మరణలు (అజ్‌కార్) మననం చేసుకుని జిక్ర్ సిలబస్‌ను తయారు చేసుకోవాలి, దాన్ని పాటించాలి. వివిధ సమయాల్లో, సందర్భాల్లోని దుఆలు సమగ్రమయిన మస్నూన్ దుఆలలో నుండి కూడా ప్రతి రమజాన్ మాసంలో కొన్నింటిని కంఠస్థం చేసుకోవాలి.

షబెఖద్ర్ మరియు ఏతెకాఫ్

ఏడవ విషయం షబెఖద్ర్ పాటింపు. ఇది ఖుర్‌ఆన్ అవతరించిన శుభరాత్రి. ఈ రాత్రి తన విలువా గౌరవాల రీత్యా ఈ రాత్రి చోటుచేసుకున్న ఆ ఘనకార్యం రీత్యా, ఈ రాత్రి పంపకం చేయబడే, పొందే ఘనకార్యాల రీత్యా, వేలాది నెలలకన్నా, వేలాది సంవత్సరాల కన్నా శ్రేష్టమయిన రాత్రి. ఈ రాత్రి నిలబడినవానికి అతని పాపాలన్నీ మన్నించివేయబడతాయన్న

శుభవార్త ఇవ్వబడింది. ప్రతి రాత్రిలో ఉన్నట్లుగానే ఈ రాత్రిలో కూడా దుఆలు స్వీకరించబడే, ఇహపరాల మేళ్ళు అర్థిస్తే అవన్నీ ప్రసాదించబడే ఘడియలు ఉన్నాయి. (ముస్లిం; జాబిర్)

మీరీ రాత్రి లభించే మేలును చేజార్చుకుంటే అంతకన్నా గొప్ప దురదృష్టం మరేదీ లేదు. (ఇబ్నెమాజ ; అనాస్ బిన్‌మాలిక్)

ఈ రాత్రి ఏ రాత్రి? దీని గురించి మనకు కచ్చితంగా తెలుపబడలేదు. ఆఖరు దశకంలోని బేసి రాత్రులలో ఒకరాత్రి అని హదీసులలో తెలుపబడింది. అంటే 21, 23, 25, 27, 29 తేదీల రాత్రుళ్ళన్నమాట. ఇది రమజాన్ ఆఖరి దశకంలోని ఏదో ఒక రాత్రి లేదా రమజాన్ మాసంలోని ఏదో ఒక రాత్రి అని హదీసులలో తెలియజేయబడింది.

సర్వసాధారణంగా ఇది ఇరవై ఏడవ రాత్రి అనీ ఈ రాత్రిలోగనక నిలబడటం, ఆరాధనను పాటించడం జరిగితే చాలు అని భావించబడుతూ ఉంది. కొందరు సహబా (రజి) మరియు మహాపురుషుల ఉల్లేఖనాల ద్వారా ఇరవై ఏడవరాత్రి అని బలపర్చబడిన మాట వాస్తవమే. కాని నా అభిప్రాయంలో ఈ రాత్రిని స్పష్టంగా నిర్ణయించబడకపోవడంలో ఒక మర్మం ఉంది. ఇది ఇరవై ఏడవ రాత్రి అని భావించబడితే ఈ మర్మం వృధా అవుతుంది.

మీరు దానిని అన్వేషించాలని, ఆ పనిలో తలమునకలై ఉండాలని, దానికోసం శ్రమపడాలని, మీ ఉత్సాహాన్ని అణగార్చకుండా ఉండాలని, ఆఖరి దశకంలోని ప్రతి బేసిరాత్రిలో దానిని అన్వేషించాలని, అంతకన్నా ఎక్కువ ధైర్యం ఉంటే ఆ దశకంలోని ప్రతి రాత్రిలో అంతకంటే ఎక్కువ ధైర్యం ఉంటే రమజాన్‌లోని ప్రతి రాత్రిలో అన్వేషించాలని దీనిని గోప్యంగా ఉంచడం జరిగింది. అదే ఇందులోని మర్మం. దాసుడు తన ప్రభువును ప్రసన్నం చేసుకోవడానికి, ఆయన కారుణ్యం, బహుమానాలను కోరుకోవడం, ఆసక్తి కనబరచడంలో ఎల్లవేళలా సర్వసన్నద్ధుడయి ఉండటం, నిరంతరం ప్రయత్నంలో ఉండటం అల్లాహ్‌కు ఎంతో ప్రీతికరం. అల్లాహ్‌కు కావలసింది ఉద్దేశ్యం, నిరంతర ప్రయత్నమే. ఇది ఏ రాత్రి జరుగుతుందో తెలిస్తే ప్రయత్నం అనే పరిస్థితి అనుభవంలోకి రాదు కదా!

ఏ రాత్రి నిలబడినా లభించే శుభశ్రేయాలు ఈ రాత్రి నిలబడినందువల్ల లభించి తీరతాయి. అయితే ఒకవైపు ఆ సాధారణ శుభశ్రేయాలు పెరిగి పోవడమే కాక మరో వైపు మరిన్ని శుభశ్రేయాల ద్వారాలు కూడా తెరచివేయ బడతాయి. పూర్తి రమజాన్ మాసం ఉమ్మత్‌పై అల్లాహ్ యొక్క ఈ ప్రత్యేక కారుణ్యానికి అద్దం పడుతుంది. ఆయన మన కోసం ఇతర రాత్రులలోని సుదీర్ఘ వ్యవధి, ఎక్కువ ఆచరణ వల్ల లభించే పుణ్యాన్ని, తక్కువ వ్యవధిలో ముక్తసరి ఆచరణకు ఇస్తున్నాడు. దైవప్రవక్త (సల్లం) ఉపదేశానుసారం దాని ఉదాహరణ ఇలా ఉంది: ఉమ్మతె ముస్లిమా (ముస్లిం అనుచర సమాజం) అసర్ నుండి మగ్‌రిబ్ వరకు లభించే ప్రతిఫలం, యూదులకు ఫజర్ నుండి జొహర్ వరకు, క్రైస్తవులకు జొహర్ నుండి మగ్‌రిబ్ వరకు ఆరాధనలో పాల్గొన్నందుకు లభించే ప్రతిఫలం కన్నా ఎక్కువ ఉంటుంది. (బుఖారీ : ఇబ్నెఉమర్) షబెఖద్ర్ మన ప్రభువు యొక్క ప్రత్యేక కారుణ్యానికి గొప్ప తార్కాణం.

కాబట్టి మీరు ధైర్యాన్ని కూడగట్టుకుని నడుం బిగించండి. కనీసం ఆఖరి దశకంలోని ప్రతి బేసిరాత్రి దైవసమక్షంలో నిలబడే, నమాజ్ చేసే, పారాయణం, స్తోత్రం, దుఆ, ఇస్తగ్‌ఫార్‌లలో గడిపే ప్రయత్నం చెయ్యండి. పూర్తి రాత్రి సాధ్యం కాకపోతే అర్ధరాత్రి తర్వాత సహరీ వరకూ రెండు మూడు గంటలు గడపండి. చేతులు కట్టుకుని నిలబడండి. సజ్దాలో నుదురు నేలకు ఆనించి కన్నీరు కార్చండి. గడగడలాడుతూ మీ పాపాలకు క్షమాభిక్ష వేడుకోండి.

దుఆ స్వీకరించబడే ప్రత్యేక ఘడియ ప్రతి రాత్రీ ఉంటుంది. కాని షబెఖద్ర్ (ఘనమైన రేయి)లో ఈ ఘడియ తీరే వేరుగా ఉంటుంది. ఆ ఘడియ ఎప్పుడు వస్తుందో తెలియదు. అందువల్ల దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ఆయిషా (రజిఅన్)కు ఇలా ముక్తసరిగా అయినా సమగ్రమయిన దుఆ నేర్పారు. ఈ దుఆను ఈ రాత్రి అత్యధికంగా చేయండి.

"అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫఫు అన్నీ"

(అహ్మద్, తిర్మిజీ)

"నా ప్రభూ! నీవు అమితంగా క్షమించేవాడవు, క్షమించడాన్ని ప్రేమిస్తావు. కనుక నన్ను క్షమించు."

ఇంకా ధైర్యం, ఉత్సాహం ఉంటే ఆఖరి దశకంలో ఎతెకాఫ్ కూడా తప్పక పాటించండి. పదిరోజులు సాధ్యం కాకపోతే తక్కువ వ్యవధిలో అయినా సరే. ఎతెకాఫ్ ఆత్మ, హృదయం, స్వభావం, వైఖరి ఆలోచన ఆచరణలని దైవభావన రంగుతో వర్ణ రంజితం చేయడానికి నిజాయితీ అచ్చులో మూస పోయడానికి దివ్య ఔషధం వంటిది. ఈ విధంగా షబెఖదర్‌ను అన్వేషించే పని కూడా సులభం అవుతుంది. ఎతెకాఫ్ పాటింపు ప్రతి వ్యక్తికీ సాధ్యమయ్యే పనికాదు. కాని దీన్ని ఫర్జెకిఫాయగా నిర్ణయించిన దాన్ని బట్టి దీని ప్రాముఖ్యత వెల్లడవుతోంది. దైవప్రవక్త (సల్లం) ఎల్లప్పుడూ ఎతెకాఫ్ పాటించారు. దాని గురించి తాకీదు చేశారు. హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలియచేస్తున్నారు: "రమజాన్ ఆఖరి దశకం వచ్చిందంటే చాలు, దైవప్రవక్త (సల్లం) సమాయత్తమయ్యేవారు. రాత్రులలో మేల్కొనేవారు. ఇంట్లోని వారిని మేల్కొలిపేవారు. మరే దశకంలోనూ చేయనంత కృషి చేసేవారు." (బుఖారి, ముస్లిం)

ఎతెకాఫ్ ఆంతర్యం, మీరు కొంత కాలంపాటు ప్రతి ప్రాపంచిక కార్యం, ఆసక్తి, కాలక్షేపాలకు దూరంగా మిమ్మల్ని మీరు కేవలం అల్లాహ్ కోసమే అంకితం చేసుకోవడం, ఆలు బిడ్డల్ని, ఇల్లూ వాకిలీ వదలి ఆయన గృహంలో ఒక మూల ఉండిపోవడం సమయాన్నంతా దైవధ్యానంలో గడపటం, ఎతెకాఫ్ ద్వారా పూర్తి జీవితంలో అల్లాహ్‌కు, ఆయన దాస్యానికి అన్నింటికన్నా ప్రాముఖ్యత లభించాలన్నదే అసలు ఉద్దేశ్యం. మీలో ప్రతి మనిషి పదిరోజుల పాటు ఎతెకాఫ్ పాటించడం సాధ్యపడదు. అయితే ఒక పని మీరు సులభంగా చేయగలరు. దాని వలన మీరు మీ స్తోమత మేరకు ఎతెకాఫ్ పాటించి అత్యధిక పుణ్యం పొందవచ్చు. అదెలా అంటే మీరు మస్జిద్‌కు వెళ్ళినప్పుడల్లా ఎతెకాఫ్ సంకల్పం చేసుకోవాలి. ఇక్కడ గడిపినంతసేపూ అల్లాహ్ కొరకే నా సమయాన్ని వెచ్చిస్తానని సంకల్పం చేసుకోవాలి.

దైవమార్గంలో ఖర్చు చేయడం

ఎనిమిదవ విషయం, దైవమార్గంలో దాతృత్వంతో ఖర్చు చేయడం. నమాజ్ తర్వాత అన్నింటికన్నా పెద్ద ఆరాధన దైవమార్గంలో ఖర్చు చేయడం. అల్లాహ్ అనుగ్రహించిన ప్రతి దానినీ ఖర్చు చేయడం. సమయమూ, శారీరక శక్తులు అన్నీ కూడా. అయితే అన్నింటినీ మించింది ధనం ఖర్చు పెట్టడం. ప్రపంచంలో అన్నింటికన్నా ప్రియమైనది, ఆకర్షించేది డబ్బేకదా. ప్రాపంచిక వ్యామోహమే సకల బలహీనతలకూ మూలం.

దైవప్రవక్త (సల్లం) మానవులందరిలోకెల్లా గొప్పదాత. రమజాన్ మాసం వచ్చినప్పుడు, జిబ్రయీల్ (అలైహి)తో ఖుర్‌ఆన్ పారాయణం చేసినప్పుడు, ఆయన దాతృత్వం, దైవ ప్రశంసలకు అంతే ఉండదు. ఆయన దాతృత్వంలో తుఫాను గాలిలా మారిపోయేవారు. (బుఖారి, ముస్లిం: ఇబ్నె అబ్బాస్) ఖైదీలను విడుదల చేసేవారు. అర్థించిన ప్రతి వారికీ ఇచ్చేవారు.

దైవమార్గంలో ఖర్చు చేయబడే ఒక్కోగింజ, ఒక్కో పైసకు కనీసం ఏడు వందల రెట్లు ప్రతిఫలం ఇస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. ఇంకా తాను కోరిన వానికి అంతకన్నా ఎక్కువ ఇస్తానని కూడా వాగ్దానం చేశాడు. పెట్టుబడికి ఇంత అపారమయిన లాభం వాగ్దానం చెయ్యబడిన వ్యాపారం ఎక్కడ దొరగ్గలదు? ఈ పెట్టుబడి కోసం రమజాన్ మాసం కన్నా మరేదీ కాగలదు? ఫర్జ్ డెబ్బయి రెట్లు పెరిగిపోతుంది. నఫిల్ ఫర్జ్‌తో సమానంగా పుణ్యం సంపాదిస్తుంది.

'దైవమార్గంలో ఖర్చు చేయడం దైవభీతిపరులకు తప్పకుండా ఉండవలసిన గుణం. రమజాన్ మాసంలో దాతృత్వ గుణం, ఉపవాసం రెండూ కలసి తఖ్వాను పొందటానికి మీరు చేసే ప్రయత్నాన్ని ఎన్నోరెట్లు ప్రయోజనకారిగా, ఫలితాన్ని రాబట్టేదిగా చేస్తాయి.

కనుక రమజాన్‌లో మీ గుప్పిట తెరచివేయండి. దైవధర్మ సంస్థాపన, ప్రచారం కోసం అప్పుల కోసం, అనాధలు రిక్తుల కోసం, దైవమార్గంలో ఎంత

సొమ్ము ఖర్చు చేయగలరో అంత చేయండి. ఆకలి దప్పుల్ని సహిస్తారు. జేబు విషయంలో కూడా కాస్త ఇబ్బందిని సహించండి. అయితే ఏమి ఖర్చు చేసినా కేవలం అల్లాహ్ కోసమే ఖర్చు చెయ్యండి. ఒకరి నుండి ప్రతిఫలం, కృతజ్ఞతలు ఆశించే కోరికను మీ మనస్సుల్లోకి రానీయకండి. **లా నురీదు మిన్‌కుమ్ జజాఅన్‌వలా షుకూరా.** మేము మీ నుండి ప్రతిఫలాన్ని కానీ, కృతజ్ఞతను కానీ కోరటంలేదు. మీరు డబ్బుతీసి, పెట్టుబడి పెట్టి మీ చేతులతోనే పెట్టుబడినీ లాభాన్నీ వృధా చేయడం వల్ల ఏం ప్రయోజనం?

జకాత్ కూడా పూర్తిగా లెక్కకట్టి ఈ మాసంలోనే తీయండి. ఈ విధంగా సక్రమతా వస్తుంది. పుణ్యం కూడా డెబ్బయి రెట్లు లభిస్తుంది.

మానవ సేవ, సహాయం

దైవప్రవక్త (సల్లం) రమజాన్ మాసాన్ని షహరుల్ మువాసాత్ అన్నారు. మనవంటి మనుషులు, మన సోదరులు, సోదరీమణుల పట్ల సానుభూతి, సహృదయతలు చూపవలసిన మాసం ఇది. ప్రత్యేకించి ఆర్థిక, ఉపాధి రంగంలో ఒండొరుల ఇబ్బందులు, కష్టాలు, బాధలలో పాలుపంచుకునే, సేవా సహాయాలు అందించే మాసం మీ ఆకలి దప్పులు మీలో తఖ్వాని కోర్కెలను అపుకోవడం, దైవాజ్ఞపాలన, సహనాల గుణాలు జనింపచేసే సాధనాలు అయినట్లే ఇతర మానవులకు ఎదురయ్యే ఆకలిదప్పులు, కష్టసుఖాలు వగైరా ఇబ్బందులు ఏమిటో మీకు చవిచూపిస్తాయి. స్వానుభవం, అనుభూతి వలన మీలో సానుభూతి సహాయాల పట్ల దృఢమైన ఆసక్తి రేకెత్తవచ్చు.

సత్కార్యం, మేలు, తఖ్వాల పరిధి ఎంతో విశాలమైనది. దీనికిగల శాఖలు అపారం. అన్నంపెట్టడం, రోగులకు చికిత్స, పరామర్శ, అనాధలు, వితంతువుల మంచీచెడ్డలు చూడటం, అగత్యపరులు, యాచకుల అవసరాలు తీర్చడం వగైరా అన్నీ ఈ పరిధిలోని కొన్ని పార్శ్వాలు. ఈ సేవకు అందరూ అర్హులే. మీ భార్యాబిడ్డలు, అప్తులు, మీ ధార్మికసోదరులు, మిత్రులూ, మీ పొరుగువారు, సాధారణ ముస్లింలు కూడా.

సానుభూతి చూపే ఈ సమగ్ర కార్యంవైపు నిరంతర శ్రద్ధ జనింప చేయడం, శ్రద్ధ వహించడానికి దైవప్రవక్త సల్లల్లాహు (సల్లం) ఉపవాసికి ఇఫ్‌తార్ చేయించడాన్ని బాగా ప్రోత్సహించారు. ఆయనిలా సెలవిచ్చారు: "ఈ మాసంలో ఎవరైనా ఉపవాసికి ఇఫ్‌తార్ చేయిస్తే అతడికి పాపాల నుండి మన్నింపు, నరకాగ్ని నుండి విముక్తి లభిస్తాయి. అందువల్ల ఉపవాసికి ఎంత పుణ్యం లభిస్తుందో ఇఫ్‌తార్ చేయించిన వారికీ అంతే పుణ్యం లభిస్తుంది. అయితే ఉపవాసి పుణ్యం ఏ మాత్రం తగ్గించబడదు". సహాబా (రజి) అడిగారు: "దైవ ప్రవక్తా! మా అందరి వద్దా ఉపవాసం ఉన్నవారికి ఇఫ్తార్ చేయించడానికి చాలినంత సామాను ఉండదు." ఆయన (సల్లం) సెలవిచ్చారు: "ఒక్క గుక్కెడు పాలు అయినా లేక ఖర్జూరం లేదా గుక్కెడు మంచి నీళ్ళతో అయినా సరే, ఇఫ్తార్ చేయించినవారికి కూడా పుణ్యం ప్రసాదిస్తాడు అల్లాహ్." తిరిగి పలికారు: ఉపవాసికి కడుపునిండా అన్నం పెట్టినవారికి అల్లాహ్ అంతిమ దినాన నా సరస్సు (కౌసర్) నుండి తనివితీరా త్రాగిస్తాడు. దాంతో స్వర్గంలో ప్రవేశించేవరకూ వారికి దాహం వేయదు. (బైహఖీ: సల్మాన్ ఫార్సీ)

కాబట్టి ఈ మాసంలో మీ సోదరులకు ప్రయోజనం చేకూర్చే పనులు చెయ్యండి. ఆకలిగొన్నవారికి అన్నం పెట్టండి. అవసరార్థుల అవసరాలు తీర్చండి. మీ సొమ్ములో నుండి చేయిచాపిన వారికీ, మీ ఎదుట లేనివారికీ వారి హక్కులు నెరవేర్చండి. గుర్తుంచుకోండి. పాపాల మన్నింపు, నరకం నుండి విముక్తి, కౌసర్ కొలను నుండి తనివితీరా త్రాగడం, స్వర్గంలో ప్రవేశం వంటి గొప్ప పురస్కారాలు జీవులకు సేవ చేయడంలో లభిస్తాయి. వారిని బాధించడం వలన రోజా, నమాజ్, దానాలకు సంబంధించిన పెద్దపెద్ద పుణ్యరాసులు వ్యర్థం అవుతాయి. సేవ చిన్నదయినా పెద్దదయినా వచ్చే తేడా ఏమీలేదు. మీ దగ్గర ఉన్నదానిలో మీరు ఇవ్వగలిగినంతే ఇవ్వండి. మీరు చెయ్యగలిగిందే చెయ్యండి. ఎటువంటి చిన్న వస్తువునైనా అల్పమైనదిగా, హీనమైనదిగా భావించకండి. ఒకపూట భోజనమే అయినా, ఒక గ్లాసెడు నీళ్ళేఅయినా, ఒక్క రూపాయే అయినా, ఒక మంచి మాటే అయినా, ఒక్క సిఫారసే అయినా దాహంతో ఉన్న కుక్కకు దాహం తీర్చడమే అయినా ఇటువంటి పనులన్నీ మిమ్మల్ని స్వర్గానికి చేరుస్తాయి.

ఖుర్‌ఆన్ వైపు ఆహ్వానం

పదవ విషయం, ఖుర్‌ఆన్ వైపు, మేలువైపు పిలవడం ఒక మానవుడికి చేయదగ్గ గొప్పసేవ, అతనిపట్ల చూపవలసిన సానుభూతి, మీరు అతడ్ని దైవాగ్రహం నుండి, నరకాగ్ని నుండి కాపాడి ఆయన అనుగ్రహం, ఆయన స్వర్గం లభించేలా చేయడం తప్ప మరేదీలేదని మీరు సులభంగా గ్రహించ గలరు. ప్రాపంచిక ఆకలిదప్పులు ప్రాపంచిక జీవితంతోపాటే అంతమైపోతాయి. ఇక్కడి బాధలు, కష్టాలు గడిచిపోతాయి. కాని పరలోకం లోని ఆకలిదప్పులు ఎన్నటికీ అంతంకావు. అక్కడి బాధలు, కష్టాల నుండి ఎన్నటికీ విముక్తి లభించదు. అక్కడ ముళ్ళ భోజనం, రక్తం, చీము, త్రాగటానికి సలసల కాగే నీరు వగైరా యాతనలు శాశ్వతంగా ఉంటాయి. కాబట్టి ఏ సేవ ద్వారా అక్కడి ఆకలిదప్పులు తీరే ఒనరులు ఏవో, వేటిద్వారా అక్కడి దుఃఖ బాధల నుండి విముక్తి లభిస్తుందో ఆ సేవయే అన్నింటికన్నా గొప్పసేవ. ఉపవాసికి ఇఫ్తార్ చేయించడం వలన అతడు ఉపవాసం ఉన్నందుకు లభించే పుణ్యం మీకూ లభిస్తుంది. అదేవిధంగా ఒకరిని సత్కార్యం వైపు ప్రేరేపించే, మేలు కలిగే మార్గంలో నడిపించినందుకయితే అతడి సత్కార్యాల ఫలం అంతా మీకూ దక్కుతుంది. ఇది ఎన్నటికీ అంతంకాని పుణ్యాల పరంపర.

ఖుర్‌ఆన్ కారణంగానే రమజాన్‌కు గౌరవం, భాగ్యం లభించాయి. అటువంటప్పుడు మీరు ప్రజలకు ఖుర్‌ఆన్ సందేశం అందించడానికి, దాని బోధనలను ఎరుకపర్చడానికి వారిని ఖుర్‌ఆన్ మిషన్ వైపు పిలవడానికి, ఖుర్‌ఆన్ యొక్క అమానత్ (అప్పగింత) హక్కు నెరవేర్చడానికి సంసిద్ధులుగా చెయ్యడానికి అది అవతరించబడిన మాసం కంటే ఎక్కువ సముచితమైన మాసం మరొకటుందా?

రమజాన్ మాసంలో మీ దినచర్యలు ఇలా ఉండాలి: ఆత్మప్రక్షాళన, ఖుర్‌ఆన్ పారాయణం, నఫిల్ నమాజులు, వీలయినన్ని అధిక పుణ్యాలు మీరు మీకోసం పోగేసుకోవటం పట్ల మీ శ్రద్ధ కేంద్రీకృతం అవుతుంది. అల్లాహ్ వైపు పిలిచే, ఖుర్‌ఆన్ వైపు అహ్వానించే పని అన్నింటికన్నా గొప్ప

సత్కార్యం. ఇంకా ఇది పుణ్యాల కోసం అన్నింటికన్నా ఎక్కువ లాభం చేకూర్చే పెట్టుబడి మాత్రమే కాదు, స్వయంగా మీకు ఆత్మప్రక్షాళన, శిక్షణలకు అన్నింటికన్నా ప్రభావపూరితమైన మార్గం కూడా.

రమజాన్ మాసంలో సాధారణ ముస్లింల హృదయాలు అల్లాహ్‌వైపు, సత్కార్యాలు, మేలువైపు మొగ్గు చూపుతాయి. అందుచేత వారు మీ మాటను శ్రద్ధగా వినే అవకాశం ఉంది. ఈ మాట వారి హృదయాలలో నాటుకోగలదు. దాన్ని వారు స్వీకరిస్తారు. తమ జీవితాలను ఈ లక్ష్యం కోసం వినియోగిస్తారు. లేదా అల్లాహ్ తన ప్రవక్తలను పంపి, పవిత్ర ఖుర్‌ఆన్ అవతరింపచేసిన లక్ష్యం కోసం ఏదయినా చేయాలని సిద్ధపడతారు.

ఈ పనికి రెండు విధానాలున్నాయి. ఒకటి, రమజాన్ మాసంలో సత్కార్యాల వైపు పిలవడం మీ దినచర్యగా చేసుకోండి. అందులో అల్లాహ్ వైపుకు పిలవడం, మంచిమాట పలికించడం, దైవధర్మం కోసం ఉత్సాహ వంతుల్ని చేసేపని కూడా చేర్చుకోండి. ఇఫ్తార్ కోసం పిలవండి. కొన్ని క్షణాలు వారితో సంభాషించే వీలు కల్పించుకోండి. కొలీగ్స్‌తో మాటామంతీ, సమావేశం సందర్భాలలో ఈ మాట వారి ఎదుట వుంచండి. వ్యవహారాన్ని రమజాన్‌ని ఆధారం చేసుకుని నడపండి. సంభాషణని ఖుర్‌ఆన్ లక్ష్యం కోసం ఏదయినా చేయాలి అన్నంత వరకు జరపండి.

మీ బంధువులు, మిమ్మల్ని కలుస్తుంటే వారిలో కొందరి అడ్రసులు మీ దగ్గర నోట్‌చేసి ఉంచుకోండి. ఈ మాసంలో వారితో నిరంతరం, ప్రత్యేక సంబంధాల ద్వారా వారికి ఖుర్‌ఆన్ చూపిన పని చేయడానికి పురోగమింప చేయాలని నిర్ణయించుకోండి.

ఆకాంక్ష

ఈ పది విషయాల్ని మీ ముందు విడివిడిగా పేర్కొన్నాను. కాని మీరు పరీక్షగా గమనిస్తే ఇవన్నీ ఒకే లక్ష్యంతో ముడిపడి ఉన్నాయి. పరస్పరం ఒక దానితో మరొకటి అనుబంధింపబడి ఉన్నాయి. ఆ లక్ష్యం, మనం ఖుర్‌ఆన్ అప్పగింత భారాన్ని మోసేందుకు తగినట్లుగా మనం రమజాన్ నుండి ఆ

తఖ్వాను, శక్తీ స్తోమతల్ని పొందటమే. ఈ లక్ష్యం అన్నింటికన్నా ముఖ్య లక్ష్యం కావడానికి కారణం, మన వ్యక్తిగత, సామూహిక జీవితాల సాఫల్యం కేవలం ఖుర్‌ఆన్‌తో అనుసంధానింపబడి ఉంది. ప్రపంచంలో మనకు గౌరవోన్నతులు కూడా ఖుర్‌ఆన్ ద్వారానే లభించగలవు. పరలోకంలో కూడా మన మోక్షం, సాఫల్యం, మనం ఖుర్‌ఆన్‌తో ఎలా వ్యవహరిస్తున్నాం, అది చూపిన మార్గంలో ఎంతవరకు నడుచుకుంటున్నాం, దానిని తెచ్చిన వానిని ఎంతవరకు అనుసరిస్తున్నాం అన్న విషయంపై ఆధారపడి ఉంది.

రమజాన్ ప్రతి ఏడూ వస్తుంది. ఒకదాని తర్వాత మరో రమజాన్ వస్తుంది. శతాబ్దాలుగా వస్తోంది. ఒకసారి తర్వాత మరోసారి ఖుర్‌ఆన్ పఠనం పూర్తి అవుతుంది. ప్రతి రమజాన్‌లో ఖుర్‌ఆన్ పఠనం జరుగుతుంది. ఉపవాసాలు పాటించబడతాయి. నమాజులు చేయబడతాయి. జిక్ర్, దుఆలతో రాత్రులు గడుస్తాయి. కాని మనం, రమజాన్ ప్రారంభానికి ముందు ఎక్కడయితే ఉన్నామో, అక్కడే ఉన్నాము. రమజానేతర మాసాలలో వలెనే తఖ్వాకు దూరం అవుతాము. మన వ్యక్తిగత పరిస్థితిలో మార్పుగానీ మన వ్యక్తిగత నైతికత సంస్కరించబడటం గానీ మన జాతి, ఉమ్మత్ పరిస్థితిలో పెనుమార్పు కలగడంగానీ జరగవు. మనపై అవమానం, అధోగతుల కారుమబ్బులు తొలగిపోవడంగానీ జరగదు. ఎందుచేత?

మొదటి కారణం అయితే, ప్రతియేడూ మనపై ఆవరించే రమజాన్ మాసం ద్వారా మనపై కుమ్మరించబడే ఖజానాలను మనం ప్రత్యేక శ్రద్ధతో ఆలోచించకుండా, అర్థం చేసుకోకుండా ఆ శుభాలను పొందలేం. ఇటువంటి స్ఫూర్తితో ప్రయత్నం చెయ్యం లేదా దానిపట్ల నిర్లక్ష్యం చూపుతాం.

అంతకుమించి మన పరిస్థితి, దైవప్రవక్త (సల్లం) హెచ్చరించిన పరిస్థితికి దగ్గరగా ఉంది. ఆయన ఇలా హెచ్చరించారు: " అబద్ధం పలకడం, అబద్ధాన్ని ఆచరించడం మానుకోనివారు భోజన పానీయాలను మానుకోవడం అల్లాహ్‌కు అవసరం లేదు." (బుఖారీ, అబూహురైరా). అల్లాహ్‌ను తన ప్రభువుగా ప్రకటించడం, ముహమ్మద్ (సల్లం)ను ఆయన ప్రవక్తగా అంగీ కరించడం, ఖుర్‌ఆన్‌ను దైవగ్రంథంగా ఒప్పుకోవడం చేస్తూనే, ఇవన్నీ మన

నుండి ఏమి కోరుతున్నాయో తెలుసుకోవడానికి ప్రయత్నించకపోవడం, ఆ ప్రకారం ఆచరించకపోవడం, ఇదంతా అబద్ధం చెప్పడం, అబద్ధాన్ని ఆచరించడం కాకపోతే మరేమిటి?

రెండవది, మన ఆరాధనల, మన నమాజుల, మన ఉపవాసాల, మన కర్మల, మన కార్యకలాపాలకూ ఖుర్‌ఆన్ తెచ్చిన ఈ లక్ష్యానికి సంబంధం లేకుండాపోయింది. ఆ లక్ష్యం కోసమే రమజాన్ ఉపవాసాలు విధిగా చేయబడ్డాయి. ఖుర్‌ఆన్‌ను దైవదాసులందరికీ అందచేయడం, దాని మూసలో మనల్ని మలచుకుని, మన సమాజాన్ని కూడా మలచి, ఖుర్‌ఆన్‌ను స్థాపించి ఆ మార్గంలో సహనంతో కృషి, త్యాగాలు చేయడం కోసమే రమజాన్ ఉపవాసాలు విధించబడ్డాయి.

"రండి! అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో మీతో ఏమంటున్నాడో తెలుసుకోండి రండి! ఆ పని మీకెంత ప్రీతికరమూ, ఆకర్షణీయమూ అయినప్పటికీ అల్లాహ్ మిమ్మల్ని ఆపిన ప్రతి విషయాన్నీ విడిచిపెట్టండి" అంటూ రమజాన్ మాసం ప్రతిసారీ వస్తుంది. లేకపోతే రమజాన్ మీ దగ్గరకు రావడం, మీరు ఉపవాసాలూ పాటించడం, ఆకలిదప్పుల్ని సహించడం, రాత్రిళ్ళు నిద్రను త్యాగం చేసి తరావీహ్ కూడా చేయడం- ఇదంత చేసినా ఆకలిదప్పులు, రాత్రిళ్ళు మేల్కోవడం తప్ప మీకేమీ దక్కకపోవచ్చు. ఇంతకంటే మీ దురదృష్టం మరేముంటుంది? పైగా, తౌరాత్ అవలంబీకుల విషయంలో అల్లాహ్ ఇచ్చిన ఉదాహరణ మీకు వర్తించగలదేమో.

మసలుల్లజీన హుమ్మిలుత్తౌరాత సుమ్మ లమ్ యహ్‌మిలూహా కమసలిల్ హిమారి యహ్‌మిలు అస్ఫారా (అల్‌జుమ్‌అ-62:5)

"తౌరాత్ అప్పగింత భారం అప్పగించబడినవారు, ఈ అమానతు భారాన్ని మోయవలసిన హక్కును నెరవేర్చలేదు. వీరు ఉదాహరణకు, వీపుపై గ్రంథాలను మోస్తూ తిరిగే గాడిద వంటిది" లేక దైవప్రవక్త (సల్లం) రమజాన్ మరియు ఖుర్‌ఆన్ ఆధారంగా దైవన్యాయస్థానంలో మనకు వ్యతిరేకంగా అభియోగం చేతబట్టి నిలచి ఉంటారేమో!

"వఖాలర్రసూలు యారబ్బి ఇన్న ఖౌమిత్తఖజూ హాజల్ ఖుర్‌ఆన మహ్‌జూరా" (అల్ ఫుర్ఖాన్ : 25-30)

"ఇంకా, ప్రవక్త అంటాడు, ఓ ప్రభూ! నా జాతి ప్రజలు ఈ ఖుర్‌ఆన్‌ను ఉపేక్షకు కప్పివేతకు గురిచేశారు"

అల్లాహ్ మనందరికీ రమజాన్ మాసంలో తఖ్వా పొందే సద్బుద్ధి ప్రసాదించుగాక! తద్వారా మనం ఖుర్‌ఆన్ హితబోధకు అర్హులం కాగలగాలి. మనం ఖుర్‌ఆన్ జ్ఞానాన్ని సంపాదించాలి. దాని ప్రకారం ఆచరించాలి. అల్లాహ్ మనకు ఖుర్‌ఆన్ సందేశాన్ని చేతబట్టి నిలిచే, దాన్ని స్థాపించడానికి జిహాద్ చేసే ధైర్యం, ఉత్సాహం, దీక్ష, తపన ప్రసాదించుగాక! (ఆమీన్)

ఉపవాస నియమాలు - వాస్తవికత

-ఇమామ్ అబూ హామిద్ ముహమ్మద్ గజాలీ (రహ్మాలై)

శరీర భాగాల్ని పాపాల నుండి నియంత్రించే వాస్తవమయిన ఉప వాసానికి ఆరు నియమాలు పాటించడం అవసరం.

1. దృష్టితో ఉపవాసం

మొదటి నియమం, చూపులను క్రిందికి వాల్చండి. అల్లాహ్‌కు అయిష్టకరమయిన వస్తువుల వంక మీ చూపు పడనీయకండి. ఏ వస్తువుల్ని చూస్తే మనసు చలిస్తుందో, అల్లాహ్ ధ్యానం పట్ల ఏమరుపాటు సంభవమో వాటిని చూడకండి.

దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారు: చూపులు మరల్చడం (అల్లాహ్ ఆపిన వస్తువుల నుండి) షైతాను బాణాలలోని విషం పూసిన ఒక బాణం. అల్లాహ్‌కు భయపడి చెడుచూపు నుండి ఆగిపోయేవాని హృదయంలో అల్లాహ్ ఈమాన్ కమ్మదనపు రుచిని ప్రసాదిస్తాడు. దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించారు.

"ఐదు విషయాల వలన ఉపవాసం భంగం అవుతుంది. ఒకటి అసత్యం, రెండవది చాడీలు, మూడవది పరోక్ష నింద, నాలుగవది అసత్య ప్రమాణం, ఐదవది కామంతో నిండిన చూపు."

నోటితో ఉపవాసం

రెండవ నియమం, నోటితో అజ్ఞానపు మాటలు పలక్కండి. అబద్ధ మాడకండి, చాడీలు చెప్పకండి, అశ్లీల సంభాషణ చెయ్యకండి, దౌర్జన్యపు మాటలు పలక్కండి, జగడం చేయకండి, మాటను మార్చకండి. మౌనంగా ఉండటం, ఈ పాపాల నుండి రక్షణ పొందటం, ఖుర్‌ఆన్ పారాయణం, దైవధ్యానంలో నిమగ్నం చెయ్యడం నోటి ఉపవాసం.

సుఫ్యాన్ సౌరీ (రజి) పరోక్షనింద వలన ఉపవాసం భంగం అవుతుంది అన్నారు. ముజాహిద్ (రజి) రెండు విషయాల వల్ల ఉపవాసం భంగం అవుతుందని అన్నారు. దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారు, " ఉపవాసం (పాపాల నుండి రక్షణకు) ఢాలు వంటిది. మీలో ఉపవాసమున్నవారు అశ్లీల మాటలు మానాలి. దుర్భాష, వృధాప్రసంగం చెయ్యరాదు. కేకలు వేయరాదు. ఎవరైనా తిట్టినా, పోట్లాటకు దిగినా 'నేను ఉపవాసం ఉన్నాను' అని చెప్పాలి.

ఒక హదీసులో ఉంది. దైవప్రవక్త(స) కాలంలో ఇద్దరు స్త్రీలు ఉప వాసం ఉన్నారు. రోజు గడవటంతోపాటు తీవ్ర ఆకలిదప్పుల వల్ల వారి పరిస్థితి దిగజారిపోయింది. వారు దైవప్రవక్త (సల్లం) సమక్షానికి ఒక మనిషిని పంపి ఇఫ్తార్ కోసం అనుమతి కోరారు. ఆయన ఆ మనిషికి ఒక పాత్ర ఇచ్చి వారిద్దరితో మీరు తిన్నదంతా ఇందులో కక్కమని చెప్పు అని చెప్పి పంపారు. ఒక స్త్రీ వాంతి చేసుకోగా ఆ పాత్ర తాజా మాంసం, రక్తంతో సగం నిండింది. రెండో స్త్రీ వాంతి చేసుకోగా పాత్ర నిండిపోయింది. అక్కడున్న వారికి ఎంతో ఆశ్చర్యం వేసింది. దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారు: "వీరిద్దరూ అల్లాహ్ హలాల్ చేసిన ఆహారంతోనే ఉపవాసం ప్రారంభించారు. అల్లాహ్ హలాల్ చేసిన వస్తువులనే తింటున్నారు. అయితే ఇద్దరూ ఒకచోట చేరినప్పుడు ప్రజలను గురించి పరోక్ష నింద ప్రారంభించారు. ఇద్దరూ తిన్న ప్రజల మాంసమే పాత్రలో ఉంది."

చెవుల ఉపవాసం

మూడవ నియమం, చెవులను చెడు మాటలు వినడం నుండి ఆపండి. నోటితో పలకడం హరాం అయిన మాటలను చెవులతో వినడమూ హరామే.

ఈ కారణంచేత అల్లాహ్, చెవులతో అసత్యాలను వినేవారి, హరాం సొమ్ము తినేవారి ప్రస్తావన జమిలిగా చేశాడు. "**సమ్మాఊలిల్ కజిబి అక్కాలూన లిస్సుహ్తి**" "చెవులొగ్గి అబద్ధం వినేవారు, హరాం సొమ్ము తినేవారు (అల్‌మాయిద 5:42). అదేవిధంగా ఆయన ఇది కూడా సెలవిచ్చి ఉన్నాడు: **లౌలా యన్‌హాహుముర్రబ్బానియ్యూన వల్‌అహ్‌బారు అన్ ఖౌలిహిముల్ ఇస్మ వ అక్‌లిహిముస్సుహ్త.** వారి విద్వాంసులు ఆచార్యులు వారిని పాపపు మాటలు పలకడాన్నుండి, హరాం తినడాన్నుండి ఎందుకు ఆపరు?

(అల్ మాయిద 5: 63)

పరోక్ష నింద విని మౌనం వహించడం కూడా హరామే. అల్లాహ్ సెలవిస్తున్నాడు: "మరి మీరు వారిలాంటి వారే అయ్యారు" అని అందువల్లనే దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారు. "పరోక్ష నిందకు పాల్పడేవాడూ, వినేవాడూ ఇద్దరూ పాపంలో సమానులే".

అవయవాల ఉపవాసం

నాలుగవ నియమం, కాళ్ళూ, చేతులు ఇతర అవయవాల్ని పాపం నుండి ఆపండి. ఇఫ్తార్ సమయంలో హరాం అయిందన్న అనుమానం కలిగిన ఆహారాన్ని తినకండి. పగలంతా హలాల్ అయిన ఆహారాన్నే భుజించి, ఇఫ్తార్ హరాం భోజనంతో చేస్తే ఉపవాసం ఎలా అవుతుంది? ఇటువంటి ఉపవాసి ఉదాహరణ ఇలా ఉంది: ఒక మనిషి భవంతినయితే కట్టుకున్నాడు. కాని నగరం మొత్తం నేలమట్టం చేశాడు. అవసరానికి మించిన భోజనం కూడా ఆత్మకు నష్టదాయకం అవుతుంది. కాబట్టి ఉపవాసం మితాహార శిక్షణనిస్తుంది. నష్టం నుండి సురక్షితుడు కావాలని మందు మాత్రం ఎక్కువ తినకుండా విషాన్ని తినేవాడు పరమ మూర్ఖుడు. హరాం భోజనం విషం. అది ధర్మాన్ని నాశనం చేస్తుంది. హలాల్ భోజనం ఒక మందులాంటిది. దానిని తక్కువగా తినడం శ్రేష్ఠం. ఎక్కువ తినడం హానికరం.

దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారు: ఎందరో ఉపవాసం పాటించే వారున్నారు. వారికి ఉపవాసం వల్ల ఆకలిదప్పులు తప్ప మరేమీ దక్కవు.

హరాం భోజనంతో ఇఫ్తార్ చేసే ఉపవాసులే ఇలాంటివారని కొందరు అంటారు. మరికొందరు, ఉపవాస సమయంలో హలాల్ నుండి ఆగిపోవడం అయితే చేసి, ప్రజల మాంసం తింటూ ఉండే వ్యక్తి విషయం ఇదని అంటారు. అంటే హరాం అయిన పరోక్ష నిందకు పాల్పడేవాడన్నమాట. తన అవయవాల్ని పాపం నుండి కాపాడుకోనివాడు అని కొందరి అభిప్రాయం.

హలాల్ ఉపాధి

ఐదవ నియమం, ఇఫ్తార్ సమయంలో హలాల్ భోజనం అయినా మితంగా తినండి. పొట్ట ఉబ్బేలా తినకండి. హలాల్ భోజనమే అయినా గొంతు వరకు మెక్కిన కడుపు అల్లాహ్‌కు అయిష్టకరం. ఉపవాసి ఇఫ్తార్ సమయంలో పగటి ఆకలిదప్పులనంతటినీ తీర్చుకునేలా, రోజంతా తినే ఆహారాన్ని ఒక్క పూటలోనే లాగించేస్తే షైతానును జయించే కామాన్ని అణచి వేయడంలో ఉపవాసం వల్ల ఎటువంటి సహకారం లభించగలుగుతుంది? ఇఫ్తార్ సమయంలో భోజనంలో వెరైటీలు ఎక్కువ ఉంటాయి. అందుచేత మిగతా రోజులలో కొన్ని నెలలు కూడా తినని మంచి, ఖరీదైన పదార్థాలు రమజాన్ నెలలో ఎక్కువగా తింటారు.

నిజానికి ఉపవాసం లక్ష్యం, ఖాళీ కడుపుతో ఉండటం, కోర్కెల్ని అదుపులో ఉంచుకోవడం. తద్వారా కోర్కెలలో తఖ్వా జనింపచేయడం. ఎవరైనా ఉదయం నుండి సాయంత్రం వరకూ ఉదరాన్ని ఖాళీగా ఉంచుకుని, ఆ తర్వాత రుచికర పదార్థాలతో బాగా కడుపు నింపుకుంటే మనసులోని కోరికలు, రుచులు రెట్టింపు అయిపోతాయి. అంతేకాదు ఉపవాసం ఉన్నప్పుడు కలగని కోరికలు ఉపవాసం ఉన్నప్పటికీ విజృంభిస్తాయి. రాత్రి కూడా తహజ్జుద్, తదితర వజీఫాలలో సౌలభ్యం కలిగేలా కడుపు ఖాళీగా ఉంచుకోవడం ఉత్తమం. తద్వారా షైతాను మన దరిదాపులకు రాలేకపోవాలి. దేవ లోకాన్ని చూస్తున్న స్థితితో ప్రయోజనం పొందగలగాలి. అతని ఆలోచనలు, ఉద్దేశ్యాలు అల్లాహ్ తప్ప ప్రతి లక్ష్యంతోనూ ఖాళీ చేయనంత [illegible] కడుపు మాత్రమే ఖాళీగా ఉంచుకోవడంతో [illegible] కేవలం [illegible] సరిపోదు.

భయం, ఆశ

ఆరవ నియమం, ఇఫ్తార్ చేసిన తర్వాత భయం, ఆశతో కూడిన స్థితికి లోనవ్వాలి. అల్లాహ్ ఉపవాసాన్ని స్వీకరిస్తాడని, తన సన్నిహితులలో చేర్చుకుంటాడని ఆశాభావం కలిగి వుండండి. దాంతోపాటే ఒకవేళ తన ఉప వాసం స్వీకరించబడకపోతేనో దైవాగ్రహానికి అర్హమైనదైతేనో అన్న భయం కూడా ఉండాలి. వాస్తవానికి ప్రతి ఆరాధనను పూర్తి చేసుకున్న తర్వాత కూడా పరిస్థితి ఇలాగే ఉండాలి.

ఈ ఆరు నియమాలను దృష్టిలో పెట్టుకుంటేనే ఉపవాసం వాస్తవ అర్థంలో సరయినదవుతుంది. అబూహురైరా (రజి) తెలియచేస్తున్నారు: "బుద్ధిమంతుడు ఉపవాసం ఉండకపోయినా, నిద్రించినా బాగానే ఉంటుంది. మూర్ఖుడు ఉపవాసం ఉండటం, మేల్కోవడం కూడా దండగే. నమ్మకం, దైవభీతి (తఖ్వా)లతో కొద్దిపాటి ఆరాధన, తప్పుడు పనులతో చేయబడ్డ, పర్వతమంత ఆరాధన కంటే శ్రేష్ఠమైనదిగా చెప్పబడింది. కొందరు ఉలమాలు అంటున్నారు, "ఎందరో ఉపవాసులు వాస్తవానికి ఉపవాసంలేనివారు అవు తారు. ఇంకా ఎందరో ఉపవాసం లేనివారు తినడం, త్రాగడం అయితే చేస్తారు కాని తమ అవయవాల్ని పాపాలకు దూరంగా ఉంచుకుంటారు. ఉపవాసం పాటించినా ఉపవాసులు కాలేనివారు తినడం, త్రాగడం అయితే మానేస్తారు కాని తమ అవయవాల్ని పాపాలకు దూరంగా ఉంచుకోలేరు.

దైవప్రవక్త (సల్లం) సెలవిచ్చారు, "ఉపవాసం ఒక అప్పగింత (అమానత్) ప్రతి ఒక్కరు తమ అప్పగింతను భద్రపరచుకోవాలి. అప్పుడాయన ఈ అయత్ పఠించారు. ఇన్నల్లాహ **యామురుకుమ్ అన్ తుఅద్దుల్ అమానాతి ఇలా అహ్‌లిహా**, అల్లాహ్ మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు, అమానతులకు ఎవరిని వారికి అప్పగించండి అంటూ తన పవిత్ర హస్తాన్ని తన కన్ను మరియు చెవిపై ఉంచుకుని సెలవిచ్చారు. కంటితో చూడటం, చెవితో వినడం కూడా అప్పగింతయే".

- సమాప్తం -